
జులై 2011
సంపుటి 5
సంచిక 3



ఎడిటర్ & పబ్లిషర్
**సందిరెడ్డి కొండలరావు**
కాకానిపాలెం, అద్దంకి.

Edited & Published and owned by
**S. Kondala Rao**
**Akhil Publications**
Kakanipalem, ADDANKI
Ph : 08593-223862
Cell : 98485 59566
e-mail : gundlakamma@yahoo.com
gundlakammas@gmail.com

and Printed at
**Saswitha Graphics**
Addanki

Layout & Design
**Real image**
Ongole
Mobile : 99485 17418

# గుండ్లకమ్మ

## సామాజిక రాజకీయ మాస పత్రిక

## విషయసూచిక

1. అనంత సంపద స్వామి 2
2. చారులో కరివేపాకు చిరంజీవి 5
3. జర్నలిస్టులకు మార్గదర్శకులు పుల్లయ్య 10
4. దగ్గుబాటి అమర్‌నాథ్ యాత్ర 12
5. న్యాట్స్ సంబరాల్లో పాల్గొన్న పురంధ్రీశ్వరి 13
6. బెన్నిట్ ముస్సోలిని 14
7. విదేశి విరాళముల నియంత్రణ చట్టం. 17
8. తెలుగు సినిమాకు తెలుగమ్మాయిలు కరువు 20
9. వాస్తు హోమం 23
10. తిరుక్కుఱళ్ - శ్రీవాణి 24



గుండ్లకమ్మ,పాఠకలకు,
ప్రకటన కర్తలకు,
తొలిఏకాదశి శుభాకాంక్షలు....
ఎడిటర్ & పబ్లిషర్

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పాఠకుల కోసం ఇంటర్‌నెట్‌లో
**"గుండ్లకమ్మ"**
**www.gundlakamma.com**

Owner, Published and edited by S. Kondala Rao published from Kakanipalem, Addanki - 523 201
and Printed at Saswitha Graphics, Opp. Rama Takies Street, Addanki. Editor S. Kondala Rao

# అనంత 'సంపద' స్వామి!

**రు.5 లక్షకోట్లు దాటనున్న తిరువనంతపురం ఆలయ సంపద**
**ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేవాలయం ఇది!**

నేలమాళిగలు తీస్తున్నకొద్దీ అనంత ధనరాశులు ఓలలాడుతున్నాయి. కళ్లు మిరుమిట్లు గొల్పే టన్నుల కొద్దీ బంగారు ఆభరణాలు... అరుదైన, పురాతన నాణేలు.. అత్యంత విలువైన వజ్రవైఢూర్యాలు... కిరీటాలు.. పచ్చలు... లెక్కించేవారి సత్తాకు సవాల్‌గా నిలుస్తున్నాయి. ఇప్పటి వరకూ భక్తుల కొంగుబంగారంగా... సుప్రసిద్ధ వైష్ణవ దేవళంగా విరాజిల్లుతున్న కేరళలోని తిరువనంతపురం అనంతపద్మనాభ దేవాలయం... ఒక్కసారిగా ప్రపంచ సంచలన క్షేత్రంగా మారిపోయింది. సుప్రీంకోర్టు ప్రత్యేకంగా నియోగించిన ఏడుగురు సభ్యుల కమిటీ... అనంత పద్మనాభుడి ఆలయంలో ఉన్న రహస్య భూగృహాల్లోని సంపదను లెక్కిస్తోంది. రోజురోజుకూ ఈ గృహాల నుంచి బయల్పడుతున్న ధనకనకరాశుల విలువ అనూహ్యంగా పెరిగిపోతూ... వీటి విలువ 5 లక్షల కోట్లు దాటిపోయింది. ఇక వీటికి ఉన్న పురాతత్వ విలువను కూడా పరిగణలోకి తీసుకుంటే... ఈ ఆస్తి విలువ మరో పది రెట్లు పెరిగిపోవడం తథ్యమంటున్నారు. ఇంతటి సిరిసంపదలు ఇక్కడ ఎన్నేళ్లుగా ఉన్నాయి? ఇప్పుడెలా బయటపడుతున్నాయి?



## ఏం జరుగుతోంది?

అనంతపద్మనాభుడి ఆలయంలో ధనకనకరాశులను భద్రపరిచే రహస్య భూగృహాలు ఆరు ఉన్నాయి. వీటినే 'కల్లారాలు' అంటారు. వీటిలో దేవుడి సంపద కొంత ఉందని తెలుసుగానీ దాన్ని ఎన్నడూ లెక్కించింది లేదు. రాళ్లతో మూసిఉండే ఈ గదుల్లో కొన్నింటినితెరచి దాదాపు 150ఏళ్లు దాటిపోయింది. 1860 లలో మూసివేసినవి కొన్నింటిని 1950 లలో సీల్ చేశారు. స్వాతంత్ర్యానంతరం స్థానిక ఆలయాలన్నింటినీ ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డులో విలీనం చేసినప్పటికీ పద్మనాభస్వామి ఆలయాన్ని మాత్రం రాజకుటుంబీకులు తమ పర్యవేక్షణ కిందే ఉంచుకొన్నారు. ఆ కుటుంబానికి చెందిన చివరి రాజు చితిర తిరునాళ్ బలరామ వర్మను అప్పటి ప్రభుత్వం రాజప్రముఖ్ (గవర్నర్ హోదాకు సమానం) గా గుర్తించింది. ఇప్పటికీ ట్రావెన్‌కోర్ రాజకుటుంబీకులే దీని కార్యనిర్వహణ ట్రస్టీలుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం 89 ఏళ్ల ఉత్తర్‌దామ్ తిరునాళ్ మార్తాండ ట్రస్టీగా కొనసాగుతున్నారు. ఆలయ సంపద నిర్వహణలో అస్తవ్యస్తంగా ఉందని, దీన్ని గాడిలో పెట్టాలనీ ఇటీవలే టి.పి.



సుందరరాజన్ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో పిటీషన్ వేశారు. దీంతో కోర్టు ఏడుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని నియోగించి మొత్తం సంపదను లెక్కింపు మొదలైంది. అక్కడి నుంచీ రోజురోజుకూ అపార ధన కనక రాశులు బయటపడుతున్నాయి. లెక్క పూర్తికాక మునుపే ఈ అనంతపద్మనాభుడి ఆలయం దేశంలో అత్యంత సంపన్న క్షేత్రమని తేలిపోయింది.

## ఏమేం ఉన్నాయి?

గతవారం రోజులుగా ఆలయ నేలమాళిగలలోని గదుల నుంచి వెలుగుచూస్తోన్న బంగారు, వజ్రాభరణాలు, దేవతా ప్రతిమలు, కిరీటాలు, పచ్చరాళ్ళు పొదిగిన నగలు...సంచుల కొద్దీ పురాతన బంగారు, వెండి నాణేలు బయల్పడ్డాయి. ఒక్క శనివారమే 35 కేజీల బంగారు విగ్రహాలు లభ్యమయ్యాయి. దాదాపు 2000 రకాల కంఠాభరణాలు, గొలుసులు వెలికి వచ్చాయి. 16వ శతాబ్దం కృష్ణదేవరాయల కాలం నాటి నాణేలు, ఈస్టిండియా కంపెనీ, నెపోలియన్ బోనా పార్టీ కాలాలా నాటివీ కేజీల కొద్దీ సంచుల్లో లభ్యమయ్యాయి. బంగారు గొలుసులు, బంగారు టెంకాయలు, స్వర్ణ శంఖాలు... ఇలా చిత్రవిచిత్రమైన పురాతన వస్తువులు ఎన్నో ఉన్నాయి. నాణేలను ఉంచిన చాలా సంచులు చీకిపోయి ఉన్నాయి.

ట్రావెన్‌కోర్ రాజులకు ఆ నాణేలు వాణిజ్య సుంకాలుగా లభించి ఉండవచ్చని, వీటిని భద్రతా కారణాల రీత్యా రాజులు ఆలయంలోపరిరక్షించి ఉంచి ఉంటారని భావిస్తున్నారు.

ఈ గదులకు తాళాలు వేసిన తీరు కూడా చాలా క్లిష్టమైన రీతిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒక్క గది తాళాలు తీయడానికి దాదాపు ఆరు గంటలు పట్టినట్టు సమాచారం.

## అత్యంత పురాతనం

అనంత పద్మనాభుడి ఆలయం అత్యంత పురాతనమైనది. ఈ ఆలయం నుంచే తిరువనంతపురానికి ఆ పేరు వచ్చినది. ఒకప్పుడు దీన్ని ఎట్టువీట్టిల్ పిల్లమార్ అనే ఎనిమిది శక్తిమంతమైన నాయర్ కుటుంబాల వారు నిర్వహిస్తుండేవారు. తర్వాతికాలంలో ట్రావెన్‌కోర్ సంస్థాన సంస్థాపకుడైన మార్తాండ వర్మ వారి నుంచి ఈ ఆలయాన్ని తన ఆధీనం చేసుకున్నారు. తాము పద్మనాభదాసుల మని ప్రకటించుకుంటూ ఆలయానికి ఈయన జీర్ణోద్ధారం చేశాడు. ఆలయంలోని శంఖాన్నే తమ సంస్థానానికి సంకేతంగా స్వీకరించాడు.



ట్రావెన్‌కోర్ రాజ కుటుంబీకులు


ఆలయాన్ని పహారాకాస్తున్న భద్రతాదళాలు

ప్రస్తుత గోపురాన్ని 1566లో నిర్మించారు. 12,008 సాలగ్రామాలతో రూపుదిద్దుకున్న, శేషశయనుడైన ఈ అనంతపద్మనాభుడిని సంపూర్ణంగా చూడాలంటే వరుసగా ఉండే మూడు ద్వారాల గుండా దర్శించుకోవాల్సిందే. నేటికీ ఆలయ పర్వదినాల్లో, ఉత్సవాల్లో ట్రావెన్‌కోర్ రాజకుటుంబీకులే అన్నీ తామై నిర్వహిస్తుంటారు.

**భద్రత భయం**

ఒకవైపు అనూహ్యంగా అనంత సంపద బయటపడుతుంటే మరోవైపు దీనిపై ప్రపంచ వ్యాప్తంగా మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ధనరాశులను పరిరక్షించడమెలాగ అన్నది పోలీసులకు, కేరళ ప్రభుత్వానికి పెద్ద సమస్యగా తయారైంది. దీనిపై కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీ ప్రత్యేకంగా అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఇప్పటికే భద్రత పెంచారు, మరో రెండు ప్లటూన్ల సాయుధ భద్రతా బలగాలను రప్పిస్తున్నారు.

**ఇంత సంపద ఏం చెయ్యాలి?**

దేశంలోని ఏ సంస్థానాదీశులూ చేయని విధంగా ట్రావన్‌కోర్ రాజకుటుంబం పద్మనాభస్వామి ఆలయ సంపదను చెక్కుచెదరనీయకుండా కాపాడారని చరిత్రకారులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ప్రస్తుతం బయల్పడిన సంపదను ఏం చెయ్యాలనే దానిపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఈ సంపదల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోకుండా ఉండడం ఉత్తమం. ఇన్నేళ్లుగా కాపాడుతూ వస్తున్న రాజవంశీకుల విధానాలకను గుణంగానే ఈ మొత్తాన్నీ ఆలయ సంపదగానే కొనసాగనివ్వాలి" అని ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నారాయణన్ అభిప్రాయపడ్డారు. ఇది ప్రభుత్వ అజమాయిషీలోకి వెళితే ఇతర దేవస్థానాల పాలకమండళ్లలో మాదిరే ఇక్కడా నిధుల దుర్వినియోగం, అవినీతి జడలు విప్పుతాయని ఆయన హెచ్చరించారు. శతాబ్దాల చరిత్ర గల అరుదైన సంపదను భవిష్యత్తు తరాల కోసం సంరక్షించాలని మరో చరిత్రకారుడు ఎంజీ శశిభూషణ్ అభిప్రాయపడ్డారు. వీహెచ్‌పీ మరికొన్ని స్థానిక హిందూ సంస్థలు ఆలయ ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోరాదని డిమాండ్ చేస్తున్నాయి. కేంద్ర వార్షిక విద్యా బడ్జెట్‌కు సరిసమానమైన ఇంతటి సంపదను నేలమాళిగల్లో మగ్గబెట్టటం కంటే ప్రజా సంక్షేమానికి వినియోగించడం ఉత్తమమని కేరళ యుక్తి వాది సంఘం వాదిస్తోంది. మొత్తానికి దీనిపై సుప్రీంకోర్టు ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందన్నది వేచి చూడాల్సిందే.

**ఇక తిరుపతి కాదు... తిరువనంతపురం!**


ఇప్పటి వరకూ వడ్డికాసుల వాడే దేశంలో అత్యంత సంపన్నుడు. కానీ తాజా రహస్య ధనాగార లెక్కలతో ఇప్పుడా స్థానాన్ని అనంతపద్మనాభుడు ఆక్రమించేస్తున్నాడు. ఇప్పటి వరకూ దేవాలయాల్లో తిరుపతి వెంకటేశ్వర క్షేత్రం, షిరిడీలోని సాయిబాబా ఆలయం, పంజాబ్‌లోని అమృతసర్ స్వర్ణదేవాలయాలే సంపన్నమైనవిగా భావిస్తున్నారు. తిరుపతి వెంకటేశ్వరుడి ఆస్తుల విలువ సుమారు రు.32,000 కోట్లని అంచనా. దీనిలో దాదాపు 3000 కేజీల బంగారం ఉంది. ఇప్పుడు లక్ష కోట్ల రూపాయల సంపదతో తిరువనంతపురం పద్మనాభుడి పేర ఒక్కసారిగా సంపన్న దేవాలయాల జాబితాలో అగ్రస్థానానికి చేరింది.

❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄

కవర్ స్టోరీ

# చారులో కరివేపాకు చిరంజీవి!

- ఇలపావులూరి మురళీమోహనరావు, సెల్ : 98661 94944



**మొత్తానికి ముసుగు తొలగింది. అయ్యవారి మనసులోని మాట బులెట్లా బయటకు తన్నుకొచ్చింది. ప్రేమే మార్గం - సేవేలక్ష్యం, సామాజిక న్యాయం అంటూ ప్రజలను, తనకు ఓట్లు వేసిన డెబ్బైలక్షల మంది ఓటర్లను నిలువునా వంచించి, ప్రజలు లేని తన రాజ్యాన్ని, నిన్నటి వరకు తాను తీవ్రంగా విమర్శించిన కాంగ్రెస్ పార్టీలో నిమజ్జనం చేసి, సోనియాగాంధీ విసరివెయ్యబోయే 'పదవి' అనే ఎంగిలి రొట్టెముక్క కోసం ఎడారిలో కాళ్ళు తెగిన ఒంటరి ఒంటెలా ఎదురుచూస్తున్న చిరంజీవి దురాశ - మీడియా సాక్షిగా నగ్నంగా బయటపడింది.**

**ఇంత అవివేకమా ?**

మూడు సంవత్సరాల క్రితం - సినిమా రంగంలో తన ప్రభంజనం వెలిగి పోయిందని గ్రహించిన చిరంజీవి తనకున్న ప్రజాదరణను సొమ్ము చేసుకోవాలనే దురుద్దేశ్యంతో 'ప్రజారాజ్యం' పార్టీని స్థాపించి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని కలలు కన్నాడు. దివంగత ఎన్టీ రామారావుతో తనను తాను పోల్చుకొని కేవలం ఎనిమిది మాసాల స్వల్పకాలంలో రాష్ట్ర గద్దెనెక్కి ఎన్టీయార్ స్థాపించిన రికార్డును బద్దలు కొట్టాలని దివాస్వప్నాలలో తేలిపోయాడు. ఆయన బామ్మరిది మరింత ముందుకెళ్ళి - శాసనసభలో ప్రతిపక్షపార్టీ అనేది లేకుంటే




అస్సలు బావుండదని తలచి చంద్రబాబుకు ఒక సీటు, రాజశేఖరరెడ్డికి ఒక సీటు ఎంతో ఉదారంగా వదిలేసి మిగిలిన రెండొందల తొంబైరెండు సీట్లు తమవేనని నిర్భీతిగా ప్రకటించేశాడు. చిరంజీవి, ఆయన సోదరులు కలసి కాంగ్రెస్ వారిని పంచెలూడదీసి తమిరికొట్టాలని ప్రజలకు పిలుపిచ్చారు. ఆంజనేయస్వామికి తన బలమెంటో తెలియదని, ఎదుటవారుచెబితేనే తెలుస్తుందని అంటారు. జానకిని అపహరించుకువెళ్ళిన రావణుడు ఆమెను లంకా నగరంలో దాచాడని తెలిసిన తరువాత మధ్యనున్న సముద్రాన్ని దాటడం తనవల్లకాదని ఆంజనేయుడు అశక్తత వెలిబుచ్చినపుడు సుగ్రీవుడు, జాంబవంతుడు మొదలైన వారు ఆంజనేయుడిని పొగడ్తలతో ముంచెత్తి, ఉబ్బితబ్బిబ్బు చేసి సాగరాన్ని దాటిస్తారు. తనను తాను ఆంజనేయుడి భక్తుడిగా చెప్పుకునే చిరంజీవి ఆంజనేయరెడ్డి సమరం పరకాల ప్రభాకర్ వంటి అనుభవజ్ఞులు 'నీకంత సన్నివేశం లేదు చిరంజీవి' అని ఎంత చెబుతున్నా వినకుండా తన బలాన్ని అతిగా అంచనా వేసుకొని రంగంలోకి దూకాడు.

**ఎన్టీయార్‌కు, చిరంజీవికి మధ్యగల తేడా ఏంటంటే :-**

1. రాజకీయాలలోకి దిగేనాటికి ఎన్టీయార్ వయసు అరవైసంవత్సరాలు. చిరంజీవి వయసు కేవలం యాభైనాలుగే.
2. అప్పటికి ఎన్టీయార్ సినిమారంగంలో తిరుగులేని నటుడు. యాభైఅయిదు దాటిన వయసులో ఎన్టీయార్ నటించిన వేటగాడు, అడవిరాముడు, సర్దార్ పాపారాయుడు, బొబ్బిలిపులి, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి మొదలైన సినిమాలు సిల్వర్ జూబ్లీలు చేసుకున్నాయి. డెబ్భైఏళ్ళ వయసులోనూ ఎన్టీయార్ నటించిన మేజర్ చంద్రకాంత్ సినిమా ఘనవిజయం సాధించింది.

   కాగా ఎభై సంవత్సరాలు కూడా నిండకుండానే సినిమా రంగంలో హీరోగా చిరంజీవి ప్రాభవం అంతరించిపోయింది. గత ఏడు సంవత్సరాలలో చిరంజీవి నటించిన అందరివాడు, స్టాలిన్, శంకర్‌దాదా జిందాబాద్, జై చిరంజీవ సినిమాలు ఘోరపరాజయాన్ని చవిచూశాయి. దాంతో చిరంజీవిలో అభద్రతాభావం నెలకొంది. సినిమా రంగంలో తనకు భవిష్యత్తు లేదని నిర్ణయించుకున్నాడు.
3. పార్టీ స్థాపించిన వెంటనే ఎన్టీయార్



జనారణ్యంలోకి సింహంలా దూకాడు. రాత్రీపగలు తేడా లేకుండా చైతన్యరథం మీద రాష్ట్రం మొత్తం చాపచుట్టేశాడు. అరవై సంవత్సరాల వృద్ధాప్యం ఎన్టీయార్ ఏమి చేయలేక పోయింది.

చిరంజీవి మాత్రం పార్టీ స్థాపించిన తరువాత పర్యటనల్లో నత్తను మరపించాడు. రెండు రోజుల పర్యటన, వారం రోజుల విశ్రాంతి చందాన ఆయన పర్యటన సాగింది. తొమ్మిది నెలల వ్యవధిలో రాష్ట్రంలో సగం కూడా పర్యటించలేక పోయాడు.

4. పార్టీని స్థాపించిన తరువాత ఎన్టీయార్ తన బంధువులనెవరినీ దరిజేరనీయలేదు. అధికారంలోకి రాకముందు దగ్గుబాటి, అధికారం వచ్చిన తరువాత చంద్రబాబు పార్టీలో చేరినా వారి స్థాయికి మించి అవకాశం ఇవ్వలేదు.

   పార్టీ స్థాపించకముందే చిరంజీవి తన సోదరులను, బావమరిదిని పార్టీలో ప్రముఖ స్థానాల్లో కూర్చోబెట్టాడు. ప్రజారాజ్యంను కుటుంబపార్టీగా తయారుచేశాడు.

5. ఎన్టీయార్ వాగ్ధాటి అనితరసాధ్యం. ఆయన సమ్మోహనరూపం, హావభావాలు, పట్టుదల ప్రజలను కట్టిపడేశాయి.


   చిరంజీవి ఉపన్యాసాలు అత్యంత పేలవం. ఆయన మాటలో, ఉచ్చారణలో స్పష్టత శూన్యం.

6. ఎన్టీయార్ తాను పోటీ చేసిన మూడు స్థానాల నుంచి అఖండమైన మెజారిటీతో గెలుపొందాడు.

చిరంజీవి తన సొంతనియోజకవర్గం నుంచి పోటీ చేసి తొలి ప్రయత్నంలోనే ఒక పేద మహిళచేతుల్లో పరాజయం పాలై, తిరుపతి నియోజకవర్గంలో చావుతప్పి కన్ను లొట్ట పోయిన చందంగా గెలుపొందాడు.

ఇలా ఏ విధంగా చూసిన ఎన్టీయార్‌కు చిరంజీవికి ఆకాశానికి భూమికి సింహానికి చిట్టెలుకకు ఉన్నంత తేడా ఉంది.

అటువంటి చిరంజీవి ఇటీవల ఒక టీవీ ఛానెల్ ప్రారంభోత్సవ సందర్భంలో రెండు



లక్షల రూపాయల విలువైన సోఫాలో విలాసంగా కూర్చుని రాష్ట్ర ప్రజలు తనను ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని ఈ దశాబ్దపు జోక్ పేల్చి హాస్యరసపోషణలో నాటి రేలంగి నుంచి నేటి బ్రహ్మానందం వరకు తనముందు దిగదుడుపేనని మీడియా సమక్షంలో నిరూపించుకున్నాడు. సాధారణ ప్రజలే కాక సినిమారంగంలోకి వారు సైతం చిరంజీవి మతిలేని ప్రకటనను చూసి పొట్టలు వగిలిపోయేట్లు నవ్వుకుంటున్నారని సమాచారం. చిరంజీవిది రాజకీయ అజ్ఞానమా? అవివేకమా? అమాయకత్వమా??

### ముందొచ్చిన చెవులకంటే:

చిరంజీవి వాచాలతను ఓ పెద్ద పెనుసంచలనంగా వర్ణిస్తూ మీడియా ప్రత్యక్ష ప్రసారం చేసి చర్యలు నిర్వహించడం చూస్తుంటే మన మీడియా ఎంత దిగజారిపోతుందో తెలుస్తుంది. కాంగ్రెస్ రాజకీయాలలో పంచాయతీ బోర్డు మెంబర్ స్థాయి వాడు సైతం ముఖ్యమంత్రి కావాలని ఉవ్విళ్ళూరుతుంటాడు. కాంగ్రెస్‌లో దశాబ్దాల తరబడి కొనసాగుతున్న హనుమంతరావు, కేశవరావు, జైపాల్‌రెడ్డి, జనారెడ్డి, బొత్సా, దివాకరరెడ్డి, గీతారెడ్డి లాంటి వందలాది మందికి ముఖ్యమంత్రి పదవి అంతిమలక్ష్యం. వారు కోరుకున్నా అందులో కొంత సబబుంది. కానీ కాంగ్రెస్‌లోకి వచ్చీరాగానే ముఖ్యమంత్రి అయిపోవాలనే తన కోరిక చిరంజీవి బయటపెట్టాడంటే నవ్వాలో ఏడవాలో అర్థంకావడం లేదు.

### నాటి ప్రజాదరణ సందేహాస్పదం

చిరంజీవి పార్టీపెట్టిన తరువాత ఆయన సభలకు జనం చెప్పుకోదగిన సంఖ్యలో వచ్చారు. అయితే ఆ జనాన్ని వారి ఆదరణను నిలబెట్టుకుని ఓట్ల రూపంలో మలచుకోవడంలో చిరంజీవి దారుణంగా విఫలమయ్యాడు. పార్టీ పెట్టిన తొలినాళ్ళలోనే సాక్షాత్తు తన సొంత




బావమరిదినే గెలిపించుకోలేకపోయాడు. దాదాపు రెండు వందల స్థానాలలో ప్రజారాజ్యం ప్రజారాజ్యం అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కలేదు. పార్టీలోకి కోటి ఆశలతో ప్రవేశించిన అనేకమంది నాయకులు పార్టీని వదిలేసి వెళ్ళిపోయారు. ఇక పరకాల ప్రభాకర్ అయితే పార్టీని ఒక విషవృక్షంగా అభివర్ణించి బయటకెళ్ళాడు. జిల్లాలలో, తాలుకాలలో అద్దెకట్టలేక, పార్టీలో కార్యకర్తంటూ మిగలక ఆఫీసులన్నీ మూసేశారు. ఇటీవల కడప, పులివెందులలో కాంగ్రెస్ పార్టీ తరఫున చిరంజీవి ప్రచారం చేస్తే – అభ్యర్థులు ధరావత్తు కూడా దక్కించుకోలేకపోయారు. అలాగే తమిళనాడు, కర్ణాటకలలో చిరంజీవి ప్రచారం చేసిన ఏ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు రాలేదు. చిరంజీవి కున్న ప్రజాబలమేంటో తెలియడానికి ఇంతకంటే ఉదాహరణ కావాలా? ప్రజాదరణ ఉన్నదనుకున్నప్పుడే కనీసం ఇరవైసీట్లు సాధించలేని చిరంజీవి కాంగ్రెస్ పార్టీ తరుఫున ముఖ్యమంత్రి కావాలనుందని కోరిక వెలిబుచ్చాడంటే అంత కంటే హాస్యాస్పదమైన విషయముంటుందా?

### రాజకీయాలలో జీరో:

తమిళనాడులో నటుడు విజయకాంత్‌ది మన చిరంజీవి కన్నా కొంచెం దిగువస్థాయి. 2006 ఎన్నికలలో అన్ని స్థానాలకు పోటీ చేసిన విజయకాంత్ కేవలం తను ఒక్కడే గెలిచాడు. అయినా కుంగిపోలేదు. నిరంతరం ప్రజల మధ్యనే తిరిగి మొన్నటి ఎన్నికలలో ముప్ఫైస్థానాలు సాధించి శాసనసభలో ప్రతిపక్ష స్థానం సాధించాడు. వచ్చే సాధారణ ఎన్నికలలో మెజారిటీ స్థానాలు సాధించి తమిళనాడు ముఖ్యమంత్రి అయినా ఆశ్చర్యం లేదు. హీరోయిజమంటే అది! చిరంజీవి మాత్రం ఓటమికి కుంగిపోయి పార్టీని నడపలేక రెండు సంవత్సరాలు తిరక్కుండానే దుకాణాన్ని మూసేసి కాంగ్రెస్‌లో దూరిపోయాడు. అంటే చిరంజీవి లక్ష్యం ప్రజాసేవ కాదని, కేవలం అధికార దాహంతోనే ఆయన రాజకీయాలలోకి వచ్చాడని తేలిపోలేదూ? ప్రజల దురదృష్టం కొద్ది ప్రజారాజ్యం అధికారంలోకి వచ్చి ఉంటే బావాబామ్మరుదులు ఈపాటికి సగం రాష్ట్రాన్ని దోచుకొని ఉండేవాని కొంతమంది సినీరంగ ప్రముఖులు వ్యాఖ్యానించారంటే చిరంజీవి పట్ల ఎంత దురభిప్రాయం ఉందో స్పష్టమౌతుంది.

### ఇది ప్రజాద్రోహం :

చిరంజీవి పార్టీ పెట్టకముందు నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డితోపాటు దాసరి నారాయణరావు వంటి ప్రముఖులు కూడా చిరంజీవిని కాంగ్రెస్‌పార్టీలోకి తీసుకురావాలని ఎంతో ప్రయత్నించారు. అయితే తన బలాన్ని అతిగా అంచనా వేసుకున్న చిరంజీవి కేవలం అహరంకారం, అతిశయంతో సొంతపార్టీని స్థాపించుకున్నాడు. చిరంజీవి ముఖ్యమంత్రి అయితే సినిమారంగం మొత్తాన్ని తన చెప్పుకింద తేలులా ఉంచాలని అల్లు అరవింద్ ఎంతో ఆశపడ్డాడు. ఎందుకంటే సినిమా రంగంలో చిరంజీవికి అందరూ శత్రువులే. బాలకృష్ణ, మోహన్‌బాబు వంటి అగ్రనటులతో

పాటు ఎవరితోనూ చిరంజీవికి సత్సంబంధాలు లేవు. ఆ విషయం అలా ఉంచితే ప్రజారాజ్యం పార్టీకి లభించిన ఓట్లన్నీ కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లు కాంగ్రెస్ మీద తెలుగుదేశం మీద అసహ్యంతో చిరంజీవి ఏదో ఉద్ధరిస్తాడని 70 లక్షల మంది చిరంజీవికి ఓట్లు వేశారు. ఇవాళ వారి సమ్మతి లేకుండానే తన పార్టీని కాంగ్రెస్‌లో మెర్జర్ చేయ్యడం ద్వారా తనను నమ్మినవారికి చిరంజీవి ద్రోహం చేశాడని చెప్పక తప్పదు. తనకు నిజంగా ప్రజాబలం ఉందని చిరంజీవి నమ్ముతున్నట్లయితే తన పార్టీ ద్వారా ఎన్నికైన ఎమ్మెల్యేలందరితోనూ రాజీనామా చేయించి కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ మీద పోటీ చేస్తే అది నిజమైన ప్రజాస్వామ్యం అనిపించుకుంటుంది. అంత తప్ప ఒకే అసెంబ్లీ కాలంలో ఒక పార్టీ టికెట్ మీద గెలిచి మరో పార్టీలో కలసి పోవడమంటే అది ముమ్మాటికీ ప్రజాద్రోహం.



చిరంజీవి తన వ్యక్తిత్వాన్ని. విశ్వసనీయతను పూర్తిగా పోగొట్టుకున్నాడు. 'పదవులు వద్దు' అంటూనే కేంద్రమంత్రి పదవికోసం విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ప్రజాబలం లేని తన అనుచరులకు రాష్ట్రంలో మంత్రి పదవులిప్పించాలని ఆరాటపడుతున్నాడు. ఇది కచ్చితంగా దుస్సంప్రదాయం. రాజకీయ పరిశీలకుల అంచనా ఏంటంటే – ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో చిరంజీవి మళ్ళీ తిరుపతిలో పోటీ చేస్తే జగన్ దెబ్బకు ఆయనకు డిపాజిట్ కూడా రాదని ఇది వాస్తవం కూడా. ఏ జగన్ కారణంగా ఆయనకు కాంగ్రెస్‌లోకి ఆహ్వానం వచ్చిందో, ఆ జగన్‌తో పోటీ చేసి తన బలమేంటో నిరూపించుకోవడం చిరంజీవి కర్తవ్యం. అది నైతిక ధర్మం కూడా. కాంగ్రెస్‌నుండి బయటకొచ్చిన జగన్ పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేసి సొంత పార్టీ ద్వారా అఖండమైన మెజార్టీతో గెలిచి తన మగతనాన్ని నిరూపించుకున్నాడు. చిరంజీవికా దమ్ముందా?

## కాంగ్రెస్‌లో కరివేపాకు :

నాటి ప్రధాని ఇందిరాగాంధీ విసిరిన వలలో ఇరుక్కుని నాదెండ్ల భాస్కరరావు ఎన్టీయార్‌ను కూలద్రోసి ఏభై సంవత్సరాలు కూడా నిండకుండానే తన రాజకీయ జీవితాన్ని సమాధి చేసుకున్నాడు. గత పాతికసంవత్సరాల నుంచి అధిష్ఠానం గుమ్మం ఎక్కిదిగి అలసట తప్ప ఏ అధికార పదవీ సాధించలేకపోయాడు. అవసరమైన మేరకు వాడుకొని ఆ తరువాత వారిని ఎంగిలి విస్తరాకును విసిరేసినట్లు విసిరెయ్యడం కాంగ్రెస్ సంస్కృతిలో ఒక భాగం. నాటి ప్రకాశం పంతులు నుంచి నీలం సంజీవరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, చెన్నారెడ్డి, సంగ్మా, శరద్‌పవార్, నట్వర్‌సింగ్ వంటి హేమా హేమీలంతా కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు బలైపోయినవారే. ఇవాళ జగన్‌ను అడ్డుకోవడానికి చిరంజీవిని ఉపయోగించు కుంటున్నారు. మంత్రిపదవి ఇస్తామంటున్నారు కానీ అది ఎంతవరకు జరుగుతుందో తెలియదు. ఒకవేళ ఏదైనా పదవి ఇచ్చినా రేపు మళ్ళీ జగన్‌ను తిరిగి పార్టీలోకి ఆహ్వానించరని గ్యారంటీ ఏమీలేదు. అవసరం తీరిన తరువాత చిరంజీవిని అతి సునాయాసంగా బయటకు గెంటి వెయ్యగల శక్తి కాంగ్రెస్ పార్టీకి ఉంది.

ఎలా చూసినా చిరంజీవి రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరం. తన తెలివితక్కువ నిర్ణయాలతో, కామెడీ చేష్టలతో చిరంజీవి తన పరువు ప్రతిష్ఠలను పూర్తిగా పోగొట్టుకున్నాడు. చిరంజీవికి అప్పనంగా మంత్రి పదవినిస్తే ఏళ్ళ తరబడి దానికై ఎదురుచూస్తున్న వారంతా రగిలిపోవడం ఖాయం. జగన్ పార్టీలోకి వలసలు మరింత పెరగవచ్చు. రాయపాటి కావూరి వంటి సీనియర్ మోస్ట్ నేతలు ముప్ఫై సంవత్సరాల నుంచి మంత్రి పదవులకోసం ఎదురుచూస్తున్నారు. అటువంటి నాయకులు తమదారి తాము చూసుకునే అవకాశముంది.

అయినా చిరంజీవికి మంత్రి పదవిచ్చే తెలివితక్కువ నిర్ణయం కాంగ్రెస్ తీసు కుంటుందా? చూద్దాం!!

❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄

# జర్నలిస్టులకు మార్గదర్శకులు

# పొత్తూరు పుల్లయ్య



**తె**లుగు పత్రికారంగంలో కొత్త ఒరవడిని ప్రవేశపెట్టి తర్వాత తరానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ప్రముఖ జర్నలిస్టులు ఎందరో ఉన్నారు. అలాంటి వారిలో సహృదయత, నిరాడంబరత, మానవతావిలువల పట్ల గౌరవం, సాటి ఉద్యోగులు, కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి, వారికోసం పోరాడే మనస్తత్వంగల పొత్తూరు పుల్లయ్యగారు పాత్రికేయ ప్రపంచానికి వన్నెతెచ్చిన జర్నలిస్టు. నార్ల వెంకటేశ్వరరావు వంటి దిగ్గజాల వద్ద పనిచేసిన పుల్లయ్యగారు పాత్రికేయుడిగా అనతికాలంలోనే తనకంటూ ఒక ప్రత్యేక శైలిని అలవరచుకున్నారు.

పొత్తూరు పుల్లయ్యగారు అనంతపురం జిల్లా, ఉరవకొండ తాలూకా, కొట్టాలపల్లిలో 1931లో ఉగాది రోజున చిన్నరంగప్ప, నారమ్మ దంపతులకు జన్మించారు. హైస్కూలు చదువు ఉరవకొండలో సాగింది. అనంతపురంలో పి.యు.సి., ఆ తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఎం.ఏ.తో పాటు ఎల్.ఎల్.బి. చదివారు.

ప్రతి జర్నలిస్టుకూ జ్ఞానంతోపాటు వ్యక్తిత్వం, తనకంటూ ఒక ప్రత్యేకశైలి ఉండాలనే ఉద్దేశంతో ఆ దిశగా ఎందరో ప్రతిభావంతుల్ని ఉత్తమ జర్నలిస్టులుగా తీర్చిదిద్దారు. పెద్దగా జ్ఞానబోధలేవీ చెయ్యకుండానే మనదగ్గర పనిచేసే వారిని కొంచెం మోటివేట్ చేయగలిగితే చాలని అంటూండేవారు. ఆంధ్రప్రభ దినపత్రికలో వాసుదేవ దీక్షితులు, టి.పి.విఠల్ తరం జర్నలిస్టులకు మార్గదర్శకులుగా నిలిచారు. వేమూరి రాధాకృష్ణ (ఆంధ్రజ్యోతి), ఐ.వెంకట్రావు (మహాటీవీ), కె.రామచంద్రమూర్తి (హెచ్.ఎమ్.టీవీ)తదితరులు ఒకప్పుడు పుల్లయ్యగారి శిష్యులే.

విజయవాడలో ప్రెస్‌క్లబ్ ఆవిర్భావం, ఇంకా విజయవంతంగా దాని నిర్వహణ వెనుక పుల్లయ్య గారు చేసిన కృషి ఎంతోవుంది. బెంగుళూరులో ఏకైక తెలుగు దినపత్రికగా ఆంధ్రప్రభ వెలుగు తున్నప్పుడు అది మరింతగా పాఠకులకు చేరువ కావడానికి పుల్లయ్యగారి చొరవ, ధీటైన నాయకత్వ లక్షణాలు కారణంగా చెప్పవచ్చు. 80వ దశకం నుంచి దాదాపు పదేళ్ళపాటు రాయలసీమ జిల్లాలకు నిజాయితీతో నిష్పాక్షికతతో వార్తల్ని అందించి, నేటి చంద్రబాబునాయుడు, దివంగత నేత రాజశేఖరరెడ్డి వంటి ఆనాటి యువనేతలకు మార్గదర్శకత్వం వహించిన ఘనత కూడా పుల్లయ్యగారి నాయకత్వంలో వెలువడిన బెంగుళూరు ఆంధ్రప్రభదే అంటే అతిశయోక్తి కాదు. ఆయన నేతృత్వంలో విజ్ఞానప్రభ, సాహిత్యప్రభ, క్రీడాప్రభల పేరుతో వెలువడిన ప్రత్యేక సంచికలు తెలుగు జర్నలిజంలోనే ఉత్తమ ప్రమాణాలుగా నిలిచాయి. షేర్‌సింగ్ పేరుతో ఆయన రాసిన ప్రత్యేక బిజినెస్, షేర్‌వ్యాపారాల వ్యాసాలు నేటి చాలామంది బిజినెస్ జర్నలిస్టులకు ఆదర్శమయ్యాయంటే కూడా అతిశయోక్తికాదు.

కులమతాభిమానాలు పత్రికారంగాన్ని ప్రభావితం చేయకూడదనే ఆలోచనతో, ఆ ధోరణు లను తీవ్రంగా వ్యతిరేకించి, సమగ్రత, నిజాయితీలతో ప్రతిభావంతులైన యువజర్నలిస్టుల్ని ప్రోత్సహించిన పుల్లయ్యగారిని పత్రికారంగం ఎన్నటికీ మరచిపోదు. ఆయనతో కలసి పనిచేసిన జర్నలిస్టులతో ఆయన గురించి, ఆయనతో అనుభవాల గురించి ఒక వ్యాస సంకలనం వెలువరిస్తే అది చాలామంది యువ పాత్రికేయులకు ఒక కరదీపిక కాగలదు. పుల్లయ్య గారు 1996 మే 31న పరమపదించారు. ఆయన పత్రికా ప్రపంచానికి చిరకాలం గుర్తుంటూనే ఉంటారు.

## పొత్తూరు పుల్లయ్య సేవలు జర్నలిస్టులకు ఆదర్శం

**జ**ర్నలిస్టుల ప్రయోజనాల కోసం కృషి చేయడం, నిబద్ధత కలిగిన వార్తలు రాయడంవంటి విషయాలలో కీ.శే. పొత్తూరు పుల్లయ్య సేవలను జర్నలిస్టులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు కోరారు.

విజయవాడ ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపకులు పొత్తూరు పుల్లయ్య 15వ వర్ధంతిని పురస్కరించుకుని మే 31న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సభలో ఆయన జర్నలిస్టుల అభ్యున్నతికి చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు.





ఈ సభలో మాజీ పార్లమెంటు సభ్యుడు యలమంచిలి శివాజీ, సీనియర్ సంపాదకులు సి. రాఘవాచారి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. తెలుగు పత్రికారంగాన్ని ప్రభావితం చేసిన నాటితరం సంపాదకులలో పుల్లయ్య ఒకరని శ్రీ యలమంచిలి శివాజీ కొనియాడారు. జర్నలిస్టులకు నివేశన స్థలాల కేటాయింపు, జర్నలిస్టుల యూనియన్ కార్యకలాపాల విషయంలోనూ ఎంతో చురుగ్గా పనిచేశారని, ఆంధ్రప్రభ దినపత్రికను ప్రత్యేక విషయాలతో సమర్థవంతంగా నడిపారని ఆయన అన్నారు.

ఈనాటి పత్రికల్లో ఏది వాస్తవమో తెలుసు కోలేని పరిస్థితిలో పాఠకులున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, విజయవాడ నుంచి తెలుగు పత్రికలు హైదరాబాద్ వెళ్ళిన తర్వాత విలువలు కోల్పోయా యన్నారు. ఈనాటి తరం జర్నలిస్టులకు శిక్షణ అవసరమని, ఇందుకోసం వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ కృషిచేయాలని సూచించారు.

ప్రముఖ పాత్రికేయులు సి. రాఘవాచారి మాట్లాడుతూ, పుల్లయ్యతో తనకున్న సహచర్యం గురించి వివరించారు. పుల్లయ్య మంచి మేధస్సు, జ్ఞానం, సమస్యలు, సంఘటనల పట్ల అవగాహన కలిగిన జర్నలిస్టని, ఆయనెప్పుడూ జర్నలిస్టులందరూ కుటుంబసభ్యుల్లా ఉండాలని కోరుకునేవారని కొనియాడారు. జర్నలిస్టులు మరింత జ్ఞానార్జన కలిగివుండి పాఠకులకు అవసరమైన సమాచారాన్ని ఇచ్చేందుకు విద్యావంతులు కావాలని కోరు కోవడంతోపాటు, వారికి అవసరమైన సహకారాన్ని పుల్లయ్య అందించేవారని ఆయన గుర్తుచేశారు. ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి ఎంతో కృషి చేశారని, దానికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారని రాఘవాచారి అన్నారు. పుల్లయ్య షేర్‌కాలంపై ప్రత్యేక వ్యాసాలు రాసి గుర్తింపు పొందారన్నారు.

అనంతరం పొత్తూరు పుల్లయ్య స్మారక పురస్కారం కింద పదవతరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన జర్నలిస్టుల పిల్లలకు నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా చావా నవ్య జగతికి రూ. 3,116, ద్వితీయ బహుమతిగా సీతంరాజు ఆదిత్యకు రూ. 2,116, తృతీయ బహుమతిగా టి. తరుణ్‌కుమార్‌కు రూ. 1116లను అందజేశారు.

విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు యస్. కె. బాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రెస్ అకాడమీ సభ్యుడు యన్. చలపతిరావు, ఏ.పి.డబ్ల్యు.జె. అర్బన్ కార్యదర్శి చావా రవి, నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎస్. ఏ. రహమాన్, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అన్నవరపు బ్రహ్మయ్య, సీనియర్ జర్నలిస్టులు వి.కె.ఎం.తిలక్, పొట్లూరి వెంకట్రావు, పుల్లయ్య కుమారులు బాబ్జీ, డా.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రఖ్యాత చిత్రకారులు, శిల్పి రేవుళ్ళ మల్లికార్జునరావుచే ఏర్పాటు చేసిన బుద్ధుని ఛాయాచిత్రాల ప్రదర్శనను యలమంచిలి శివాజీ ప్రారంభించారు. నగరానికి చెందిన అనేకమంది సందర్శించి ఈ చిత్రాలను తిలకించారు.



# అమర్‌నాధ్ యాత్ర ఒక మధురస్వప్నం

## అమరనాధ్ యాత్రలో పాల్గొనడం నా అదృష్టం : ఎమ్మెల్యే దగ్గుబాటి




హిందువులకు అతిపవిత్రంగా భావించే అమరనాధ్ యాత్రలో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు పర్చూరు శాననసభ్యులు డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ యాత్రలో పాల్గొని తిరిగి స్వరాష్ట్రానికి బయల్దేరిన డాక్టర్ దగ్గుబాటి తన యాత్రా విశేషాలను గుండ్లకమ్మతో పంచుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన ఈ యాత్ర పొడవునా రాళ్ళు, బురద, వర్షం ఉంటుందని తెలిపారు. భూమికి 14 వేల 5 వందల అడుగుల ఎత్తులో హిమాలయ పర్వతాలపై ఈ యాత్ర కొనసాగుతుందని, 2 వందల సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన ఈ యాత్ర హిందువులకు అతి పవిత్రమైనదిగా తెలిపారు. యాత్ర పలు వ్యయప్రయాసలతో కూడిందన్నారు. పెహల్గాం నుండి షుమారు 40 కిలోమీటర్లు కాలినడకన యాత్ర చేయాల్సి ఉందన్నారు. బాల్టి నుండి అయితే షుమారు 16 కిలోమీటర్ల కొండచరియలపై యాత్ర కొనసాగించాల్సి ఉందన్నారు. శివపార్వతులు ఈ ప్రాంతంలో పర్యటించిన అనంతరమే కైలాసం చేరారనేది భక్తుల విశ్వాసంగా తెలిపారు. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ గుహను, గుహలో ఏర్పడిన మంచు శివలింగంను ముస్లిం మతస్తులు మొదటిగా కనుగొన్నారని వారు ఈ నిర్వహణ బాధ్యత వహించినటువంటి ట్రస్టీలు ఉండి అభివృద్ధి చేసినట్లు తన యాత్ర అనుభూతిపరంగా తెలుసుకున్నానన్నారు. ఈ యాత్ర సందర్భంగా వచ్చే ఆదాయంలో కూడా ఆ కుటుంబానికి మొన్న మొన్నటివరకు కొంత భాగం ఉండేదని, ప్రస్తుతం గవర్నరు ఆధ్వర్యంలో ఉన్నటువంటి కమిటీ నిర్వహణ బాధ్యతలు చేపడుతుందని తెలిపారు. ప్రతి శ్రావణమాసంలో మొదలై రాఖీ పౌర్ణమి వరకు ఈ యాత్ర కొనసాగుతుందని తెలిపారు. అతి ప్రమాదకరమైన ఈ యాత్రలో దాదాపు ఇప్పటివరకు 18 మంది అస్వస్థతకు గురైనట్లు ఆయన తెలిపారు. నిత్యం సైత్యం పహారా మధ్య ప్రతి ఏటా లక్షల మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొనడం జరుగుతుందని ఆయన తన విశేషాలను గుండ్లకమ్మతో పంచుకున్నారు. తన యాత్రను పూర్తి చేసుకొని తిరిగి బయల్దేరుతున్నట్లు ఆయన తెలిపారు.


❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄


# అమెరికాలోని న్యాట్స్ సంబరాల్లో పాల్గొన్న కేంద్రమంత్రి పురంధ్రీశ్వరి













# ప్రపంచ తత్త్వం-నాయకత్వం

## దగ్గుబాటి పుస్తక సంధానం

క్రీస్తుపూర్వం నాటి పరిణామాలు, క్రీస్తుశకం నాటి ఉదంతాలను గుప్పిట పట్టిన ప్రయత్నమిది. సోక్రటీస్ తత్త్వాన్ని కళ్లకు కట్టడంతో పాటు అనంతరం వచ్చిన ప్లేటో, అరిస్టాటిల్‌ల నిరుపమానతను అక్షరబద్ధం చేయడం అనన్యమైన కృషికి నిదర్శనమే. అలాగే, గాంధీ, నెహ్రూల జీవితాలను హృద్యంగా ఆవిష్కరించడమే కాకుండా, సమకాలీన సమాజంలో వారు వేసిన ముద్రను విశ్లేషించడం గొప్ప ప్రయత్నమే. మొత్తం 50 మంది తత్వవేత్తలు, రాజనీతిజ్ఞులు, పాలనాదక్షులు.. ఇలా ప్రతి ఒక్కరి జీవితాన్ని భిన్నకోణాల్లో విశ్లేషించి, విభిన్నమైన రచనా సౌరభంతో దగ్గుబాటి వెంకటేశ్వరరావు కలంనుంచి జాలువారిన 'ప్రపంచ తత్వం-నాయకత్వం' అనే గ్రంథం. ఆయన రాజకీయ అవగాహనకు, తాత్వికపరమైన దృక్కోణానికి, నాయకత్వ గాఢతకు, అన్నింటికీ మించి నేల విడిచి సాము చేయని గుణానికి అద్దం పట్టేదే.






# అర్వాచీన రోమన్ సామ్రాజ్య నియంత, ఫాసిజానికి జనకుడు

## బెనిటో ముస్సోలినీ (1883-1945)

**19వ శతాబ్దంలో క్రమంగా రూపుదిద్దుకున్న కమ్యూనిజం, సోషలిజం రాజకీయ వ్యవస్థలకు వ్యతిరేకంగా ఏక వ్యక్తి నియంతృత్వాన్ని 'ఫాసిజం' పేరుతో రచించి, ప్రయోగించి విషాదాన్ని సృష్టించి ఆఖరికి ఓటమిపాలై జుగుప్సాకరంగా మరణించిన ఇటలీ రాజకీయ నాయకుడు బెనిటో ముస్సోలినీ. ఫాసిజం పదాన్ని ప్రపంచవ్యాప్తం చేసిందీ ఆయనే.**



ఇటలీలోని ప్రెడప్పియోలో 29 జూలై 1883న ఒక పేద కుటుంబంలో జన్మించిన ముస్సోలినీకి చదువు బాగా అబ్బలేదు. తండ్రి సాధారణ కార్మికుడు. అయినా సోషలిస్టు భావాలు గల వ్యక్తి. ముస్సోలినీకి విద్యార్థి దశలోనే అహం బాగా అలవడింది. ఎవరినీ లెక్కచేసేవారు కాదు. సహ విద్యార్థితో చిన్న గొడవ రావడంతో కత్తితో పొడిచారట. అందువల్ల పాఠశాల యాజమాన్యం కొంతకాలంపాటు ఆయన్ని తరగతుల నుంచి బహిష్కరించింది. ప్రవర్తనతో పొంతన లేకుండా ఆయన తెలివి మాత్రం అమోఘంగా వికసించింది. తోటివారిపై అధికారం చెలాయించడం నేర్చుకున్నారు. వృత్తికోసం ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసి కొంతకాలం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు.

యువకులందరికీ సైనిక శిక్షణ విధిగా ఉండేది ఆ రోజుల్లో, యుద్ధాలు



సర్వసాధారణం గనుక. 1902లో 19 సంవత్సరాల వయసులో సైనిక శిక్షణను తప్పించుకోవడానికి పొరుగునే ఉన్న స్విట్జర్లాండ్ దేశానికి పారిపోయారు ముస్సోలినీ. అప్పటికే ఆయనపై తండ్రి భావజాలం పనిచేసి సోషలిస్టు పార్టీ కార్యకలాపాల్లో పాలుపంచుకునేవారు. స్విట్జర్లాండ్‌లోనూ సోషలిస్టు పార్టీ అలజడుల్లో పాలుపంచుకుంటూ ఒకసారి నిబంధనలకు వ్యతిరేకంగా సమ్మెలో పాల్గొన్నందుకు అరెస్టయి కొన్ని వారాలు కారాగారవాసం రుచిచూశారు. స్విట్జర్లాండ్‌లో రాళ్ళు కొట్టే పనితో తన్ను తాను పోషించుకునే ముస్సోలినీ లో హింసాత్మక ప్రవృత్తి తగ్గకపోవడంతో స్విస్ ప్రభుత్వం ఆయన్ని ఇటలీకి పంపివేసింది. అలా 1904లో ఇటలీకి చేరిన ముస్సోలినీ సైనిక శిక్షణ పొంది ఆ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. సైన్యంలో ఆయన చూసే చురుకుదనానికి పదోన్నతులు కూడా పొందారు. ఆయన ఉపన్యాసాలు, రచనలు ఎంతో శక్తివంతంగా ఉండేవి. సోషలిస్టు పార్టీ సభ్యులు యువకుడైన ముస్సోలినీ మాటల మంత్రాలకు లొంగిపోయేవారు. పార్టీలో ప్రాధాన్యతను సంతరించుకుంటూ 29 సంవత్సరాల వయసుకే పార్టీ అధికారిక పత్రిక 'అవంతి'కి ప్రధాన సంపాదకుడయ్యారు. పత్రికలో అచ్చయ్యే వ్యాసాలు యువతీ యువకులకు స్ఫూర్తిగా ఉండేవి. సరిగ్గా ఆ సమయంలోనే సోషలిస్టు భావాలపై గురితప్పిన ముస్సోలినీలో నియంతృత్వ లక్షణాలు పొడచూపాయి. 1914లో సోషలిస్టు పార్టీని వీడిన ముస్సోలినీ 'పొపోలొదెల్ ఇటాలియా' పేరుతో స్వంతంగా ఒక వార్తాపత్రికను స్థాపించి 'అటానమస్ ఫాసిస్ట్స్' పేరుతో ఒక గ్రూపును ప్రారంభించారు. మధ్యతరగతి యువతీ యువకులు పెద్ద సంఖ్యలో ఆయన అభిమానులయ్యారు.

అది మొదటి ప్రపంచ యుద్ధ సమయం. 1917లో ఒక సైనిక కవాతులో గాయపడిన ముస్సోలినీ మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పత్రికారంగం నుంచి నేరుగా రాజకీయాల్లోకి వచ్చారు. యుద్ధ ఫలితంగా ఇటలీ ఆర్థికంగా దెబ్బతిన్నది. ఇతర ఐరోపా రాజులలాగానే ఇటలీ రాజు కూడా సమాజంపై పట్టు కోల్పోతున్నారు. కమ్యూనిస్టు, సోషలిస్టు ఉద్యమాలు, అలజడులు, పెరుగుతున్న పారిశ్రామికీకరణ, సమ్మెలు సమాజాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. పరిపాలన ఎలా ఉండాలి. ఎవరు పరిపాలన చేయాలనే అంశాలు అసందిగ్ధంగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల్ని రెచ్చగొట్టడం సులభం. ఈ పరిస్థితులనే ముస్సోలినీ తనకనుకూలంగా మార్చుకున్నారు.

సోషలిజానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ఏక వ్యక్తి నియంతృత్వ పాలనలోనే సమాజాన్ని అభివృద్ధి చేయవచ్చని భావించారు ముస్సోలినీ. ఆ విధంగా ఆయన భావాల్ని తీర్చిదిద్దిన పుస్తకం గ్రీకు తత్వవేత్త ప్లేటో రచించిన 'ది రిపబ్లిక్'. ఈ పుస్తకాన్ని పలుమార్లు చదివిన ముస్సోలినీ ఆ మార్గంలోనే ఇటలీని శక్తివంతమైన దేశంగా మలచాలని కలలుగన్నారు. ఆయనపై జర్మన్ దార్శనికుడు 'నీషే' ప్రభావం అపారంగా ఉంది. కమ్యూనిస్టు సాహిత్యాన్ని కూడా చదివిన ముస్సోలినీ దానికి



హిట్లర్‌తో ముస్సోలినీ

ప్రత్యామ్నాయంగా ఫాసిజాన్ని రూపొందించారు. ఆయనకు 'విప్లవ ఫాసిస్టులు' కూడా చేయూతనందించారు. ముస్సోలినీ తన గ్రూపును 'కాన్‌స్టిట్యూయెంట్ ఫాసిస్టులు' అని నామకరణం చేసుకున్నారు. కానీ ఆయన సామాజిక రాజకీయ ఉద్యమం అనుకున్నంత విజయవంతం కాలేదు. 1919లో ఎన్నికల్లో పోటీచేసినా అపజయం పాలయ్యారు. ఎలాగైనా లక్ష్యాన్ని ఛేదించాలనే ఉద్దేశ్యంతో ఆ సంవత్సరమే 'ఫైటింగ్ ఫాసిస్టులు' పేరుతో కొత్త ఉద్యమాన్ని ప్రారంభించారు. 1921లో జరిగిన ఎన్నికల్లో 35 మంది డెప్యూటీలను గెలిపించుకున్న ముస్సోలినీ ఇటలీ రాజకీయాల్లో తిరుగులేని నాయకుడయ్యారు. నేషనల్ ఫాసిస్టు పార్టీని స్థాపించి, రెండున్నర లక్షలమంది అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఇటలీ రాజుకు కూడా ముస్సోలినీ భయం పట్టుకుంది. 1922లో ఇటలీ రాజు విక్టర్ ఇమ్మాన్యుయేల్ ప్రధానమంత్రి లూయిగా ఫాక్టాను తిరస్కరించి ముస్సోలినీకి అధికారం ఇవ్వాల్సి వచ్చింది. అలా 1922లో అధికారాన్ని భయపెట్టి చేతుల్లోకి తీసుకున్న ముస్సోలినీ రెండు దశాబ్దాలపాటు ఇటలీని మూడు చెరువుల నీళ్ళు తాగించారు.

మానవ హక్కుల్ని నిర్లక్ష్యం చేసి, విపక్షనేతల అంతు చూసి వ్యతిరేకత లేకుండా చేసుకున్నారు. ఇటలీ సోషలిస్టు పార్టీ ప్రధాన నాయకుడు గియకోమొ మట్టెబట్టిని మట్టుబెట్టించారు. దాంతో అపకీర్తిని బాగా మూటగట్టుకున్నారు. అయినా పుంజుకున్న ముస్సోలినీ వాటికన్‌లోని పోప్‌ను కూడా లోబరచుకున్నారు. పోప్ పియస్ XI (1857-1939) ముస్సోలినీని దేవుడి దూతగా అభివర్ణించారు. ముస్సోలినీని పూర్తిగా ప్రతినాయకుడిగా కూడా వర్ణించలేదు. ఆయన ఇటలీని అవినీతికి పాల్పడకుండా పరిపాలించారు. రహదారులు నిర్మించారు. పారిశ్రామికీకరణను వేగవంతం చేశారు. ఎక్కువమందికి ఉద్యోగాలు కల్పించారు. కానీ మానవహక్కుల్ని అడగకండి అన్నారు. తెలివైనవాడు సమాజాన్ని తన ఇష్టం వచ్చినట్టు పరిపాలించవచ్చని భావించారు ముస్సోలినీ.

1930లలో ప్రపంచవ్యాప్తంగా



కలిగిన ఆర్థిక సంక్షోభం ఇటలీని కూడా కమ్ముకుంది. జాతీయ సమస్యలనుంచి ప్రజల దృష్టికి మరల్చడానికన్నట్టు దక్షిణంగా మధ్యధరా సముద్రం ఆవల ఉన్న ఇథియోపియాపై 1935లో దండయాత్ర చేశారు. 1936లో ఇటలీని కొత్త రోమన్ సామ్రాజ్యంగా ప్రకటించారు. స్పెయిన్ దేశంలో ఫ్రాంకోను బలపరచినా పెద్దగా లాభం లేకపోయింది. స్పానిష్ అంతర్యుద్ధంలో ఇటలీ ఆ విధంగా కలుగజేసుకుంది. ఆ సమయంలోనే జర్మనీలో అధికారాన్ని కైవసం చేసుకున్న హిట్లర్ యుద్ధ మేఘాల్ని సృష్టిస్తున్నారు. హిట్లర్‌తో భావసారూప్యత గల ముస్సోలినీ ఆయనతో జతకలిశారు. ఇటలీలో యూదుల వేటను ప్రారంభించారు ముస్సోలినీ. 1940లో ఇటలీని రెండవ ప్రపంచయుద్ధ కొలిమిలోకి తోసిన ముస్సోలినీ ఇటలీని మరింత ఇబ్బందుల్లోకి నెట్టారు.

ముస్సోలినీ దృష్టిలో వ్యక్తి పరిపూర్ణత సాధించాలంటే యుద్ధస్ఫూర్తిని కలిగివుండాలి. యుద్ధంలో మాత్రమే వ్యక్తి పూర్తి సామర్థ్యం బయటపడుతుంది. అందువల్ల దేశాభివృద్ధికి అది అవసరమని భావించారు ముస్సోలినీ. కానీ ఇటలీ సైన్యం అంత శక్తివంతంగా లేదు. పాత ఆయుధాలు, అసంపూర్ణ శిక్షణ, నాయకత్వలోపం, లక్ష్యంలో స్పష్టత లేకపోవడంతో ఇటలీ రెండవ ప్రపంచ యుద్ధంలో చావుదెబ్బతిన్నది. అన్ని చోట్ల అమెరికా, ఇంగ్లండు, రష్యా సేనలు ఇటలీ సైన్యాన్ని ఓడించాయి. శత్రుసైన్యాలు ముస్సోలినీని బంధించాయి. అయినా జర్మన్ సైనిక దళం సాహసోపేతమైన దాడి చేసి శత్రుసైన్యాల నుండి ముస్సోలినీని విడిపించింది. కానీ స్వదేశంలో శత్రువుల సంఖ్య పెరగడంతో ముస్సోలినీ ఇటలీకి నాయకత్వం ఇవ్వలేకపోయారు. 1942లో ఇటలీ యుద్ధంలో పరాజయం పొందిన తర్వాత మరో ఆరు నెలల తర్వాత ముస్సోలినీని ఇటలీ ప్రజలు పదవిలో నుంచి దించివేశారు. ఆ తర్వాత ఆయన హిట్లర్‌కు అనుచరుడిగా మాత్రమే ఉన్నారు. హిట్లర్‌కే రోజులు దగ్గర పడడంతో ముస్సోలినీ ఒక దిక్కులేని నాయకుడయ్యారు.

**ముస్సోలినీ ఇన్ని సంవత్సరాలు చేసిన అధర్మ పాలనకు, అకృత్యాలకు మూల్యం చెల్లించాల్సిన సమయం ఆసన్నమయింది. ఒకప్పుడు దేశంలోని రాజకీయ పార్టీలన్నింటినీ రద్దుచేసి, విపక్షనాయకుల్ని కిరాతకంగా చంపించి, కార్మికుల రక్తంతో ఇటలీ వీధుల్ని ఎర్రపర్చిన ముస్సోలినీని ప్రత్యర్థులు వదల్లేదు. ఏప్రిల్ 28, 1945న సైన్యానికి దొరికన ముస్సోలినీని తన ఉంపుడుగత్తె క్లారా పెటబ్బిని కౌగలించుకొని ఉండగా తుపాకితో కాల్చి చంపారు. సైన్యం ఆయన శవాన్ని రోమ్ నగరంలో ఒక పెట్రోలు బంకులో తలకిందులుగా వేలాడదీశారు. రోమ్ ప్రజలు ఆ శవం మీద ఉమ్మి, రాళ్ళతో కొట్టి కక్ష తీర్చుకున్నారు. ఆ శవాన్ని కూడా మాంసం వేలాడదీసే ఇనుపకొక్కేలతో వేలాడదీశారు.**

**ముస్సోలినీ ఎంత నియంత అయినా వ్యాపారాలన్నింటినీ ప్రభుత్వం చేతుల్లో ఉంచారు. దేశాన్ని ఖచ్చితంగా ముందుకు నడిపారు. కానీ ఆయన యుద్ధోన్మాదం వల్లనే ఇటలీ నాశనమయ్యింది. ఆయన చావుతోనే ఇటలీ మళ్ళీ కోలుకున్నది. ముస్సోలినీ జీవితం నేటితరం రాజకీయ నాయకులకు ఒక హెచ్చరిక.**

# విదేశీ విరాళముల నియంత్రణ చట్టం - 2010



విదేశీ విరాళముల నియంత్రణ చట్టం - 2010 ఈ ఏడాది మే 1 నుండి అమలులోకి వచ్చింది. దీనికి సంబంధించి అవసరమైన ప్రభుత్వం ఉత్తర్వులను కేంద్ర హోంశాఖ ఈ ఏడాది ఏప్రిల్ 29న జారీ చేసింది. దాని ఫలితంగా, అంతవరకు అమలులో ఉన్న విదేశీ విరాళముల నియంత్రణ చట్టం, 1976 పూర్తిగా రద్దు అయింది.

విదేశీ విరాళముల నియంత్రణ చట్టం 2010 క్రింద గల సెక్షన్ 48కి అనుగుణంగా విదేశీ విరాళముల నియంత్రణ నిబంధనలను కూడా కేంద్ర హోంశాఖ ఏప్రిల్ 29న జారీ చేసింది. ఇవి వెంటనే అమలులోకి వచ్చాయి.

విదేశీ విరాళములను స్వీకరించిన సంస్థలు ఆ విరాళములను దుర్వినియోగం చేయకుండా నియంత్రించడంలో రద్దు అయిన చట్టం కన్నా మెరుగైన రీతిలో విదేశీ విరాళముల చట్టం - 2010 కొన్ని కఠినతరమైన నిబంధనలను రూపొందించింది.

**కొత్త అంశాలు :**

విదేశీ విరాళముల నియంత్రణ చట్టం - 2010 పలు కొత్త అంశాలను ప్రవేశ పెట్టింది. ఈ చట్టంలోని నిబంధనల ప్రకారం, విదేశీ విరాళములను స్వీకరించిన వ్యక్తి కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి పొందిన వారికి మాత్రమే ఆ విరాళములను బదిలి చేయవచ్చును. ఇతరులకు బదిలి చేయరాదు.

కొత్త నిబంధనల ప్రకారం, విదేశీ విరాళములను ఏ అవసరానికి స్వీకరించడం జరిగిందో, దానికి మాత్రమే వినియోగించవలెను. అయితే, ఒక ఆర్థిక సంవత్సరంలో పరిపాలనపరమైన అవసరాలకు మాత్రం ఆ విరాళాల్లో 50 శాతానికి మించి వినియోగించరాదు. అయితే, ప్రభుత్వ అనుమతితో దానిని 50 శాతానికి మించి వినియోగించవచ్చును. సంస్థ రిజిస్ట్రేషన్ ను పూర్తిగా రద్దు చేయడం, లేదా తాత్కాలికంగా నిలుపుదల చేయడం ఈ చట్టంలోని కొత్త అంశాలు.

విదేశీ విరాళములు స్వీకరించిన వ్యక్తి రిజిస్ట్రేషన్ రద్దు జరిగినప్పుడు ఆ సంస్థ ఆస్తుల నిర్వహణకు సంబంధించిన కొన్ని అంశాలను కొత్తగా ఈ చట్టం పరిధిలోకి చేర్చడమైనది.

**రిజిస్ట్రేషన్ సులభతరం :**

విదేశీ విరాళములు పొందడానికి దీ అవసరమైన రిజిస్ట్రేషన్ లేదా అనుమతి నిమిత్తం సమర్పించే దరఖాస్తులోనే నిబంధనలను, దరఖాస్తుకు అవసరమైన ఫారంలను కూడా పొందుపరచడమైనది. రిజిస్ట్రేషన్ లేదా అనుమతి నిమిత్తం సమర్పించే దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందించాలి, దరఖాస్తును సంబంధిత వ్యక్తి సంతకంచేసి, అవసరమైన పత్రాలతో ఆన్ లైన్‌లో పొందుపరచిన దరఖాస్తు హార్డ్ కాపిని 30 రోజుల్లో సంబంధిత అధికారులకు సమర్పించాలి. లేని యెడల అటువంటి దరఖాస్తును చెల్లనిదానిగా భావించవలసి ఉన్నది. ఇటువంటి సందర్భంలో దరఖాస్తుదారుడు తిరిగి ఆరు నెలల అనంతరం మాత్రమే మరొక దరఖాస్తును సమర్పించవలసి ఉన్నది.

ఒక దరఖాస్తును సమర్పించిన అనంతరం ఏ దరఖాస్తుదారుడు కూడా రిజిస్ట్రేషన్ లేదా ముందస్తు అనుమతి నిమిత్తం ఆరు నెలల కాలంలోపు మరొక దరఖాస్తును సమర్పించరాదు. రిజిస్ట్రేషన్ రుసుం 2000

రూపాయలు కాగా ముందస్తు అనుమతి రుసుం 1000 రూపాయలు.

**రిజిస్ట్రేషన్‌కు 5 సంవత్సరాల కాలపరిమితి :**

విదేశీ విరాళములు స్వీకరించడానికి సంస్థల రిజిస్ట్రేషన్‌కురద్దయిన చట్టం కింద కాలపరిమితి లేదు. అయితే, విదేశీ విరాళముల నియంత్రణ చట్టం 2010 కింద పొందిన సర్టిఫికేట్ కాలపరిమితి 5 సంవత్సరాలు. కాగా, ఏదైనా ఒక ప్రత్యేక అవసరం నిమిత్తం లేదా ఏదైనా ప్రత్యేకమైన విరాళం కోసం పొందిన ముందస్తు అనుమతి యొక్క కాలపరిమితి దానికి అనుగుణంగా మాత్రమే ఉంటుంది. అదనంగా, యిలా ముందస్తు అనుమతి పొందిన వ్యక్తులు విధిగా సర్టిఫికేట్ కాలపరిమితి మించకుండా అంటే కనీసం 6 నెలల లోపలే తిరిగి అనుమతి పొందవలసి ఉన్నది.

ఏదైన సంస్థ విదేశీ విరాళముల నియంత్రణ చట్టం - 1976 లోని సెక్షన్ 6 కింద రిజిస్ట్రేషన్ చేసుకున్న లేదా ముందస్తు అనుమతి పొందినట్లయితే, ఆ సంస్థ లేదా ఆ వ్యక్తికి విదేశీ విరాళముల చట్టం - 2010 కింద కూడా రిజిస్ట్రేషన్‌లు, అనుమతులు ఈ చట్టం అమలులోకి వచ్చిన 5 సంవత్సరాల వరకు మాత్రమే చెల్లుతాయి. ప్రస్తుతం ఏ వ్యక్తి అయినా, దీర్ఘకాలిక ప్రాజెక్టును నిర్వహిస్తున్న సందర్భంలో, ఆ ప్రాజెక్టు కాలపరిమితి ముగియడానికి కనీసం 12 నెలల ముందు మరో పర్యాయం రిజిస్ట్రేషన్ నిమిత్తం దరఖాస్తు చేసుకోవలసి ఉన్నది.

**ఎకౌంటిగ్ నిబంధనలు :**

ఆయా సంస్థలు నిర్వహిస్తున్న విదేశీ విరాళముల బ్యాంక్ ఖాతాల్లోకి ఇతర తరహా నిధులను జమచేయరాదు. ప్రతి బ్యాంక్ కూడా సంబంధిత అధికారులకు విదేశాల నుండి తమ ఖాతాదారులు స్వీకరించిన నిధుల వివరాలను ఎప్పటికప్పుడు సమర్పించవలసి ఉన్నది.

విదేశీ విరాళముల నిమత్తం రిజిస్ట్రేషన్ చేసుకున్న సంస్థ లేదా ముందస్తు అనుమతి పొందిన సంస్థ విధిగా విదేశీ విరాళములకు సంబంధించిన ఎక్కౌంట్స్, రికార్డులను ప్రత్యేకంగా నిర్వహించవలసి ఉన్నది. వీటి ఎక్కౌంట్స్ ను తనిఖీ చేయడానికి అవసరమైననిబంధనలను కూడా ఈ చట్టం పొందుపరచింది. రిజిస్ట్రేషన్ పొందిన సంస్థలు ఎక్కౌంట్స్ తనిఖీ సందర్భంగా అధికారులు కోరిన సమాచారాన్ని విధిగా అందించాలి. లేనియెడల చట్టం ప్రకారం శిక్షార్హులు.

**తప్పుడు సమాచారానికి అపరాధ రుసుం :**

తప్పుడు సమాచారంతో అక్రమంగా రిజిస్ట్రేషన్ లేదా ముందస్తు అనుమతి పొందడానికి అక్రమంగా ఇతరుల తరుపున వ్యవహరించడం, సమాచారాన్నిగుప్తంగా ఉంచడం వంటి అంశాలకు న్యాయస్థానాలు శిక్షలను విధిస్తాయి. కనీసం 6 నెలల జైలు శిక్ష, లేదా అపరాధ రుసుం విధించడం లేదా రెండు శిక్షలను విధించే అవకాశం ఉన్నది.

దీనికి సంబంధించినొక కొత్త నిబంధనను కూడా ఈ చట్టంలో పొందుపరచడమైనది. శిక్షకు గురైన వ్యక్తులు, దాని నుండి తప్పించుకోవడానికి ప్రయత్నించిన సందర్భంలో అతని ఆస్తులను కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్వాధీనం చేసుకొని, విక్రయించే అధికారాన్ని కూడా ఈ చట్టం కల్పిస్తుంది.

ఈ చట్టంలోని నిబంధనలను అతిక్రమించడానికి ఎవరైనా ప్రయత్నించిన యెడల అతను 5 సంవత్సరముల జైలు శిక్ష, లేదా అపరాధ రుసుం, లేదా రెంటికి గురికాగలడు.

**రాజకీయ తరహా సంస్థలు :**

ఏదైనా ఒక సంస్థ విదేశీ విరాళముల నియంత్రణ చట్టం - 2010 ప్రకారం రాజకీయ పార్టీ కానప్పటికీ, ఆ సంస్థ రాజకీయ స్వభావం కలిగి ఉంటే, దానిని రాజకీయస్వభావం కలిగిన సంస్థగా ప్రకటించడానికి అవసరమైన మార్గదర్శక సూత్రాలను చట్టంలో పొందుపరచారు.

ఏదైనా రాజకీయపరమైన సంస్థగాని, ఒక సంఘం గాని, లేదా ఒక కంపెనీగాని వార్తలను ప్రసారం చేస్తున్నట్లయితే, అటువంటి సంస్థలను విదేశీ విరాళములు స్వీకరించడానికి నిషేధం గల వర్గం కింద చేర్చడమైనది.

**కోటి రూపాయలకు మించిన విరాళములు స్వీకరించిన సంస్థల వివరాలు బహిర్గతం :**

విదేశీ విరాళముల నిమిత్తం రిజిస్ట్రేషన్ చేసుకున్న సంస్థ లేదా ముందస్తు అనుమతి పొందిన సంస్థ ఒక ఆర్థిక సంవత్సరంలో కోటి రూపాయలు లేదా దానికి సమానమైన విరాళములు స్వీకరించిన యెడల, దానికి సంబంధించిన రశీదులు, ఆ నిధుల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని ఆ ఏడాది మాత్రమే కాక తదుపరి ఏడాది కూడా ప్రభుత్వానికి తెలియజేయవలసి ఉన్నది. అటువంటి సమాచారాన్ని సాధారణ ప్రజలకు కూడా తెలియజేయడానికి వీలుగా ఆ సంస్థకు సంబంధించిన వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్న నిబంధన కూడా ఈ చట్టంలో పేర్కొనడమైనది. వినియోగించని నిధుల వినియోగానికి ప్రభుత్వం నుండి ముందస్తు అనుమతి :

ఈచట్టం కింద రిజిస్ట్రేషన్ ను తాత్కాలికంగా నిలుపదల చేసిన సందర్భంలో విదేశీ విరాళములు స్వీకరించిన కార్యక్రమం లక్ష్యం, ఆశయాలను నెరవేర్చడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం అనుమతితో మొత్తం విరాళంలో 25 శాతం నిధులను మాత్రమే వినియోగించవలసి ఉన్నది. మిగిలిన 75 శాతం నిధులను రిజిస్ట్రేషన్ పునరుద్దరణ జరిగిన తర్వాత మాత్రమే వినియోగించవలెను.

రిజిస్ట్రేషన్ రద్దు జరిగిన వ్యక్తి వద్ద ఉన్న నిధులు ఆ వ్యక్తి బ్యాంక్ ఖాతాలో ఉన్నట్లయితే, సంబంధిత బ్యాంక్ అధికారి ఆ నిధులను కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసేంత వరకు విడుదల చేయరాదు. విదేశీ విరాళముల సమాచారాన్ని బ్యాంకులు విధిగా ప్రభుత్వానికి సమర్పించవలసి ఉన్నది : ఏ వ్యక్తి అయినా, విదేశీ విరాళముల నిమిత్తం రిజిస్ట్రేషన్ లేదా ముందస్తు అనుమతి పొందే ప్రక్రియ పూర్తి కాకముందే విరాళముల వారి ఖాతాలో జమ అయినట్లయితే, ఆ వివరాలను ఈ చట్టం కింద సదరు బ్యాంక్ అధికారి విధిగా విరాళములు అందిన 30 రోజుల్లో ప్రభుత్వానికి తెలియజేయవలసి ఉన్నది. బ్యాంక్ అధికారి తన నివేదికలో విరాళములు అందించిన దాత పేరు, చిరునామాతో పాటు, విరాళములు స్వీకరించిన వ్యక్తి పేరు,

చిరునామా, బ్యాంక్ ఎక్కౌంట్ నంబరు, బ్యాంకు పేరు, శాఖ, విరాళము మొత్తము అనగా విదేశీ కరెన్సీ విలువ, భారతీయ కరెన్సీ విలువ, విరాళము అందిన తేది, విదేశీ విరాళములు అందిన విధానం అనగా నగదు, చెక్ లేదా ఎలక్ట్రానిక్ బదిలి తదితర వివరాలను ప్రభుత్వానికి సమర్పించవలసి ఉన్నది.

పైన పేర్కొన్న సమాచారంతోపాటు, రిజిస్ట్రేషన్ పొందినవ్యక్తి ఒక కోటి రూపాయలు, లేదా అంతకు సమానమైన ఒకే లావాదేవీలో గానీ, లేదా లావాదేవీల్లో గాని 30 రోజుల కాలపరిమితిలో పొందిన సందర్భంలో సంబంధిత బ్యాంక్ అధికారి విధిగా 30 రోజుల్లో ఆ సమాచారాన్ని ప్రభుత్వానికి సమర్పించవలసి ఉన్నది.



**విరాళముల స్వీకర్త ప్రతి ఏడాది సి, ఎ ధృవీకరణ నివేదికను సమర్పించాలి :**

ఈ చట్టం కింద విదేశీ విరాళముల స్వీకరించిన వ్యక్తి ప్రతి ఏడాది చార్టర్డ్ ఎకౌంటెంట్ ధృవీకరించిన నివేదికను ముందుగా రూపొందించిన ఫారంలలో భర్తి చేసి సమర్పించవలసి ఉన్నది.

దానితోపాటు సంస్థ ఆదాయం, వ్యయం, నిధుల స్వీకరణ, చెల్లింపులు, బాలన్స్ షీట్ తదితరములును ఏప్రిల్ 1తో ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి, ఆ ఆర్థిక సంవత్సరం పూర్తి అయిన 9 నెలల్లో కేంద్ర హోంశాఖ కార్యదర్శి, న్యూఢిల్లీ కి సమర్పించవలసి ఉన్నది. ఆ నివేదికలో విదేశీ విరాళములను జమచేసిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఆ నిధులను వినియోగం నిమిత్తం ఇతర బ్యాంక్ ఖాతాలకు మళ్ళించిన సందర్భంలో ఆ వివరాలు పొందుపరచవలసి ఉన్నది.

బ్యాంక్ ఖాతా వివరాల నివేదికను విరాళములు జమ చేసిన బ్యాంక్ నుండి ఎక్కౌంట్ స్టేట్‌మెంట్‌ను సంబంధిత బ్యాంక్ అధికారితో ధృవీకరించి జతచేయవలసి ఉన్నది. ఇటువంటి ఎక్కౌంట్ స్టేట్‌మెంట్ కాపీలను సంబంధిత విరాళముల స్వీకర్త విధిగా ఆరు నెలలపాటు తన వద్ద భద్రంగా ఉంచుకోవలెను. ఏదైనా ఆర్థిక సంవత్సరంలో సంబంధిత వ్యక్తి విదేశీ విరాళములు స్వీకరించని యెడల ‘లేదు’ అన్న నివేదికను ప్రభుత్వానికి సమర్పించవలసి ఉన్నది.

**దర్యాప్తు సంస్థలు ప్రతిమూడు నెలలకొక పర్యాయం తమ నివేదికను సమర్పించాలి :**

కేంద్ర దర్యాప్తు సంస్థ లేదా ఏదైనా ఇతర సంస్థ ఏదైనా అంశంపై దర్యాప్తు జరుపుతున్న సందర్భంలో ప్రతి కేసు వివరాలను ప్రతిమూడు నెలలకొక పర్యాయం కేసు నెంబరు, రిజిస్ట్రేషన్ తేది, చార్జిషీట్ నమోదు చేసిన తేది, న్యాయస్థానం, విచారణ పురోగతి, తీర్పు వెలువడిన తేది, ముగింపు తదితర వివరాలను తన నివేదికలో పొందుపరచవలసి ఉన్నది. విదేశీ విరాళములు స్వీకరించే వ్యక్తి యొక్కరాజకీయ కార్యకలాపాలను కేంద్ర హోంశాఖ కార్యదర్శికి సమర్పించవలసి ఉన్నది. అటువంటి సమాచారం రిజిష్టరు పోస్టు ద్వారా సమర్పించవలసి ఉన్నది.

**ఇతర సంస్థలకు నిధుల బదిలి :**

విదేశీ విరాళములు స్వీకరించడానికి రిజిస్ట్రేషన్ లేదా ముందస్తు అనుమతి పొందని వ్యక్తులకు నిధులను బదిలి చేయదలచినపుడు కేంద్ర ప్రభుత్వం నుండి ముందుగా అనుమతి పొందవలెను. విదేశీ విరాళములో కేవలం 10 శాతం నిధులను మాత్రమే బదిలీ చేయడానికి అనుమతి ఉన్నది. బదిలీ చేసిన నిధులను వినియోగించే జిల్లాలోనే మేజిస్ట్రేట్ ధృవీకరించిన దరఖాస్తును మాత్రమే నిధుల బదిలి నిమిత్తం సమర్పించవలసి ఉన్నది. నిధుల బదిలి నిమిత్తం అందిన దరఖాస్తులపై సంబంధిత జిల్లా మేజిస్ట్రేట్ 60 రోజుల్లో తగిన నిర్ణయం తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ అనుమతిలేనిచో దాత తన నిధులను ఎట్టి పరిస్థితిలోను బదిలీ చేయరాదు.

విదేశీ విరాళములను బదిలీ చేయదలచిన వ్యక్తులు ముందుగా కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ అనుమతి పొందిన వ్యక్తి విదేశీ విరాళముల బదిలి చేయదలచినపుడు, ఆ విరాళములను స్వీకరించే వ్యక్తి ఈ చట్టం కింద పొందుపరచిన నియమనిబంధనలను పూర్తి చేయకపోయినప్పటికి కూడా కేంద్ర ప్రభుత్వం నిధుల బదిలికి అనుమతించవచ్చు. నిధుల బదిలికి సంబంధించిన వివరాలను బదిలి చేసిన వ్యక్తితోపాటు, ఆ నిధులు పొందిన వ్యక్తి కూడా ప్రభుత్వానికి సమర్పించవలసి ఉన్నది.

**ఇతర అంశాలు :**

విదేశీ విరాళముల నియంత్రణ చట్టం - 2010 లో స్పెకులేటివ్ కార్యకలాపాలను వివరించడమైనది. పరిపాలన ఖర్చులను కూడా క్షుణ్ణంగా వివరించడమైనది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి విదేశీ విరాళములు పొందిన సందర్భములో ఈ చట్టంలోని సెక్షన్ 21కి అనుగుణంగా పోటీ చేయడానికి అతనిని ఎంపిక చేసిన 45 రోజుల్లో ఆ వివరాలను ప్రభుత్వానికి సమర్పించవలసి ఉన్నది.

# తెలుగు సినిమాకు తెలుగు అమ్మాయిలుకరువు
# ముంబాయి నుంచి అరువు

*"పసిడి రెక్కలు పంచి కాలం ... పరుగులెత్తిన జాడలేవి... ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహముల్...! ఏవి తల్లీ...!*

**ఈ వాక్యాలు నేడు తెలుగు చిత్ర పరిశ్రమకు కథానాయికలుగా తెలుగు అమ్మాయిలు కరువైన పరిస్థితికి అతికినట్టు సరిపోతాయి. ఎందుకంటే ఒకప్పుడు పరభాషా చిత్రాలకు సైతం కాంచనమాల, కన్నాంబ, భానుమతి, సావిత్రి, దేవిక, అంజలీదేవి, కృష్ణవేణి, కృష్ణకుమారి, షావుకారు జానకి, వాణిశ్రీ, జయసుధ, జయప్రద, శ్రీదేవి, విజయశాంతి వంటి అగ్రకథానాయికలను అందించిన తెలుగు చిత్రరంగం ప్రస్తుతం తానే**



**కథానాయికల కొరతను ఎదుర్కొంటోంది.**

**పదారణాల అచ్చమైన తెలుగు పడుచులు తెల్లబోయి చూస్తు ఉండగా ముంబాయి ముద్దుగుమ్మలు టాలీవుడ్ రారాణులుగా వెలిగిపోతున్నారు. దాంతో నేడు విడుదల అవుతున్న ప్రతి తెలుగు చిత్రంలోను హీరోయిన్స్‌గా ఆర్తిఅగర్వాల్, ఇలియానా, కాజల్, త్రిషా, నయనతార, అనుష్క, కత్రినాకైఫ్ వంటి వంటి ముంబాయి భామలే దర్శనమిస్తున్నారు.**

**ఇలా నేడు తెలుగు చిత్ర పరిశ్రమ కథానాయికల కోసం బొంబాయి భామల చుట్టూ పరిభ్రమించడానికి కారణాలు ఏమిటి? ఈ పరిస్థితులు తలయెత్తడంలో ఎవరి పాత్ర ఎలాంటిది!**

**మొదలైన విషయాలను సమగ్రంగా సంపూర్ణంగా చర్చకు పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. అందుకు అందుబాటులో వున్నంత వరకు చరిత్రను త్రవ్వి, వాస్తవాలను వెలికి తీసి కారణాలను విశ్లేషించి నిజాలను అఖిలాంధ్ర ప్రేక్షక జనాల ముందు వుంచాలన్న చిన్న ప్రయత్నమే ఈ వ్యాసం...**

చరిత్రలోకి వెళ్ళితే తొలి భారతీయ మూకీ చిత్రాన్ని నిర్మించిన దాదాసాహేబ్ పాల్కేకు రాజా హరిశ్చంద్ర చిత్రంలో చంద్రమతి పాత్ర పోషణకు స్త్రీ మూర్తులు ఎవరూ ముందుకు రాకపోవడంతో చివరకు ఒక



పురుషుడితోనే చంద్రమతి పాత్రను నటింపచేయాల్సి వచ్చింది.

అందుకు భిన్నంగా దక్షిణాదిలో ముఖ్యంగా తెలుగులో మూకీలను నిర్మించిన రఘుపతి వెంకయ్య, ఆర్.ప్రకాష్ (వెంకయ్య తనయుడు) తదితర దర్శక నిర్మాతలు నిర్మించిన భక్త నయనార్, గజేంద్రమోక్షం, భక్తప్రహ్లాద తదితర చిత్రాలలో స్త్రీ పాత్రలను నాగరత్నమ్మ, సురభి కమలాబాయి, కన్నాంబ, కాంచనమాల వంటి అభినయ మూర్తులే స్త్రీ పాత్రలను పోషించారు.

తెలుగు తారామణి హారంలో తొలి సూపర్ స్టార్ ఇమేజ్ కాంచనమాల వంటి స్త్రీ మూర్తికే దక్కటం విశేషం. ఐదో దశకం నుంచి ఎనిమిదో దశకం వరకు వహిదారెహమాన్ (తెలుగు యువతి) హేమమాలిని (తల్లిదండ్రులు దక్షిణాది వారైనప్పటికి పుట్టి పెరిగింది ఢిల్లీలో) వైజయంతిమాల, రేఖ (జెమినీ గణేష్ తనయ) జయప్రద, శ్రీదేవి వంటి దక్షిణాది తారలే.. హిందీ చిత్రాల గ్లామర్ సామ్రాజ్యానికి ఓ మకుటం లేని మహారాణులుగా వెలిగారు.

అలానే తెలుగులో ఓ వెలుగు వెలిగిన భానుమతి, సావిత్రి, కృష్ణకుమారి, అంజలీదేవి, విజయనిర్మల, వాణిశ్రీ, జయసుధ వంటి అగ్రశ్రేణి తెలుగు కథానాయకలు కూడా అడపాదడపా హిందీ చిత్రాలలో నటించేవారు.

ఇలా నాటి తొలితరం నుంచి నేటి



మలితరం దాకా హిందీ చిత్ర సీమలో దక్షిణాది దొరసానులే కథానాయికలుగా వెలుగులు విరజిమ్మారు. అయితే నేడు అందుకు విరుద్ధంగా... దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమలో ఉత్తరాది అమ్మాయిలు అవకాశాలలోను, అత్యధిక పారితోషికంలోను అగ్రస్థానం కోసం పోటీపడడం విశేషం.

మొట్టమొదటిగా ఉత్తరాది తారలను దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమకు ప్రేక్షకులకు పరిచం చేసిన ఘనత భూకైలాస్ చిత్ర దర్శక నిర్మాతలకు దక్కుతుంది.

అప్పటికే ఉత్తరాది చిత్రాలలో తన శృంగార భంగిమలతో, అంగాంగ ప్రదర్శనతో హిందీ ప్రేక్షకులను వేడి ఎక్కించి, వెర్రి



ఎక్కించిన ప్రముఖ నాట్య తార హెలన్‌ను భూకైలాస్ చిత్రంలో "సుందరాంగా అందుకోరా అనే పాట ద్వారా దక్షిణాది ప్రేక్షకులకు పరిచయం చేసి ఈ సాంప్రదాయానికి నాంది పలికిన ఘనతను ఆనాటి ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ ఎ.వి.యమ్ స్వంతం చేసుకుంది.

ఇందుకు కారణాలను విశ్లేషించు కుంటే... కారణాలు ఏం లేవు... తెలుగు అమ్మాయిలు ముందుకు రావడం లేదు అందుకే ముంబాయి వాళ్ళను ప్రోత్సాహిస్తున్నారు



అంటూ ఏక వాక్యంలో కొట్టేయవచ్చు.

అయితే తెలుగు అమ్మాయిలు ముందుకు రాకపోవడానికి కూడా ఎన్నో కారణాలు వున్నాయి. ఆ కారణాలు ఏంటో విశ్లేషించుకుంటే నిజాలు తెలుస్తాయి.

1. ఎనిమిదో దశకం వరకు కథకులు, దర్శకులు, నిర్మాతలు, కథలో అన్ని పాత్రలకు, తగిన ప్రాముఖ్యత వుండేటట్లు జాగ్రత్తలు తీసుకునేవారు. కాబట్టి హీరో పాత్రతో పాటు, హీరోయిన్ పాత్రకు, విలన్ పాత్రకు కమెడియన్ పాత్రను కూడా ప్రాముఖ్యత వుండేది.

కాబట్టి ఆనాడు ప్రావీణ్యం, గాత్ర సౌలభ్యం, అభినయ సామర్థ్యం, చూడచక్కని సౌందర్యం కల భానుమతి, సావిత్రి, కృష్ణకుమారి, అంజలీదేవి, జమున, వాణిశ్రీ, జయప్రద, జయసుధ, శ్రీదేవి వంటి వారు అగ్ర హీరోలతో పోటీ పడుతూ అగ్ర హీరోయిన్స్‌గా ఓ వెలుగు వెలిగారు.

కాలం మారింది. స్టోరీ డామినేషన్‌తో డైరెక్టర్స్ మీడియా అయిన చిత్రరంగంలో హీరో డామినేషన్ పెరిగి పోయింది. ఫలితంగా కథ బ్రహ్మ పదార్ధంగా మారిపోయి హీరో ఇమేజ్ తెర మీదకు రావడంతో హీరోయిన్స్ ఉనికి పాటలకు మాత్రమే పరిమితమైపోయింది.

ఈ పరిస్థితులలో అభినయం కంటే, సాంప్రదాయ సౌందర్యం కంటే, గ్లామర్‌కు, ఎక్స్‌పోజింగ్‌కు ప్రాముఖ్యత పెరగటంతో తెలుగు అమ్మాయిలు తెలుగు సినిమాలలో నటించడానికి ముందుకు రావడం లేదు.

2. ఆనాడు పౌరాణికం, జానపదం, చారిత్రాత్మకం, సాంఘికం వంటి విభిన్న కథా వస్తువులతో చిత్రాలు నిర్మించబడేవి. ఈ విభిన్న చిత్రాలలో కూడా కథానాయిక పాత్రకు







సముచిత గౌరవం తగిన ప్రాముఖ్యత ఉండేది. అలా ఆనాడు సముచిత రీతిలో అభినయాన్ని ప్రదర్శించటానికి అవకాశం ఉండేది.

ఆ రోజుల్లో కథానాయిక పాదాలను చూపించడం సైతం అశ్లీలతగా భావించేవారు. అందుకే ఎన్నో గౌరవనీయమైన తెలుగు కుటుంబాల నుంచి కూడా అమ్మాయిలు తెలుగు చిత్రాలలో నటించడానికి ముందుకు



వచ్చేవారు.

కాలం మారింది. కథలలో వైవిధ్యత తగ్గింది. పౌరాణిక, చారిత్రాత్మక జానపద చిత్రాలు కనుమరుగు అయ్యాయి. సాంఘిక చిత్రాలతో కూడా కుటుంబ కథా చిత్రాల స్థానంలో ప్రేమ కథా చిత్రాలు చోటు చేసుకున్నాయి.

అయినా బాపు, విశ్వనాథ్, దాసరి లాంటి సమర్థత గల దర్శకుల పుణ్యమా అని హీరోయిన్స్ పరిస్థితి పూర్తిగా దిగజారకపోవడంతో జయసుధ, జయప్రద, శ్రీదేవి లాంటి దక్షిణాది పడుచులు తెరపైకి వచ్చారు.

ఈ సంధికాలంలోనే రాఘవేంద్రరావు హీరోయిన్ పాత్రకు గ్లామర్ మెరుపులు అద్దారు. స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ కోసం ఆనాడు ఆయన చేసిన ప్రయోగం రాను రాను వెర్రి తలలు వేసి కుక్కమూతి పిందెలు కాయటంతో తెలుగు సినిమాలో హీరోయిన్ పాత్ర వ్యాంప్ పాత్ర స్థాయికి దిగజారింది. దాంతో తెలుగు అమ్మాయిలు ఎవ్వరూ హీరోయిన్స్‌గా పరిశ్రమలోకి ప్రవేశించటానికి ఇష్టాన్ని ప్రదర్శించడం లేదు.

3. కాలక్రమేణా పరిస్థితులు మరీ దిగజారాయి. మెచ్చూర్డ్ లవ్ స్టోరీస్ ప్లేస్‌లో టీనేజ్ లవ్ స్టోరీస్ చోటు చేసుకోగా మరో వైపు హీరో ఇమేజ్‌ను ఆకాశానికెత్తే యాక్షన్‌కథలు కూడా పరిశ్రమలోకి ప్రవేశించాయి.

ఈ రెండు తరహా కథ హీరోయిన్‌ను పాత్రను పాటలకే పరిమితం చేయటమే కాకుండా మరింత గ్లామర్ డాల్‌గా మార్చే స్థాయికి దిగజారింది. సహజంగా తెలుగు అమ్మాయిలను సిగ్గు, బిడియం సహజాభరణం. సాంప్రదాయ దుస్తులను ధరించడంలో కనబరిచే ఇష్టత బికిని, టైట్ జీన్స్ వంటి మోడరన్ డ్రస్‌లు ధరించడంలో కనపరచరు. అదే సమయంలో మారిన వ్యాపార విలువల దృష్ట్యా వంటి పైన ధరించే దుస్తుల విషయంలో ఎంత పొదుపు పాటిస్తే హీరోయిన్స్‌గా అంత రెట్టింపు అవకాశాలను ఇచ్చేటందుకు తెలుగు పరిశ్రమ సుముఖతను వ్యక్తం చేయటంతో తెలుగు అమ్మాయిలు తెలుగు సినిమాలకు దూరమయ్యారు. తెలుగు దర్శక నిర్మాతలు కూడా భాష, అభినయం లాంటి విషయాలలో నైపుణ్యం కంటే పీలికల్లాంటి మోడరన్ డ్రెస్‌లలో అంగ ప్రదర్శనలాడే గ్లామరస్ ఫిగర్స్‌కే ప్రాధాన్యత నివ్వడంతో ముంబాయి అమ్మాయిల ప్రాధాన్యత పెరిగింది.

కాబట్టే భాష రాకపోయినా సరే డబ్బింగ్‌తో ఎక్స్‌ప్రెషన్ పలకకపోతే సజెషన్ షాట్స్‌తో మాయ చేస్తూ వారికి కోట్లకు కొలది పారితోషికాలను ముట్టచెపుతున్నారు.

ఈ స్థాయిలో నిర్మాత, దర్శకుడు, హీరో, హీరోయిన్స్‌గా ముంబాయి వారినే



ప్రోత్సహిస్తున్నారంటే ఎక్స్‌పోజింగ్‌లో కానీ, రిలేషన్ మెయిన్ టైన్ చేయటంలో కానీ వీలు అయినంత ఫ్రీగా మూవ్ అవ్వటమే కారణం అని అంటే దాన్ని కొందరూ మనది దురాభిమానం, అమాయకత్వం అంటారు.

ఏది ఏమైనా కొత్తదనం కరువైన తెలుగు చిత్రసీమ ప్రతి సినిమాకి ముంబాయి నుంచి కొత్త కొత్త కధానాయికలను అరువు తెచ్చుకొని ఇదే నవ్యత అని సరిపెట్టుకోమనటం ప్రేక్షకుల ప్రారబ్దం!


ఈ పరిస్థితులు ఇలానే కొనసాగితే కొంత కాలం తరువాత సీత, సావిత్రి లాంటి పాత్రలను మలచాలంటే హాలీవుడ్ సెక్సీ క్వీన్స్‌ను ఎంపిక చేయడం ఇదే కొత్తదనం అంటూ కటింగ్ ఇవ్వడం ఖాయం.

ఆ పరిస్థితులు తల ఎత్తకుండా ఎదురుతిరగాల్సిన బాధ్యత ఆ ప్రేక్షకుడిదే. ఎందుకంటే సినిమా వాళ్ళు అనుభవిస్తున్న అష్ట ఐశ్వర్యాలను భోగభాగ్యాలను మూలకులు ప్రేక్షకులే. వారు తలుచుకుంటే జీరోలు హీరోలు అవుతారు. హీరోలు జీరోలు అవుతారు. కాబట్టి ఆలస్యం చేయకుండా ఈ పరిస్థితులు చక్కదిద్దడానికి ఉపక్రమిద్దాం.

❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄

వాస్తు

# వాస్తు హోమం



**గంటా సాయిబాబా,** వాస్తు పరిశోధకులు, సిద్ధాంతి.
సెల్ : 9848340130

మన పూర్వీకులు ఋషులు యజ్ఞము, హోమము, అగ్నిహోత్రముల వలన ప్రజల యొక్క శ్రేయస్సుకు ఆరోగ్యములు, వర్షములు, శాంతులు కలుగుటకు ఔషధ గుణములు కలిగినటువంటి కొన్ని రకముల వృక్షముల నుండి ఆకులు నుండి దినుసుల నుండి యజ్ఞహోమాదులు చేసి ప్రజలకు వారి క్షేమ ఆరోగ్యముల కొరకు నిర్వహించుచుండెడివారు. ఋషులు, మెడికేటెడ్ కలిగిన మొక్కలు, వృక్షముల యొక్క కాండములను సేకరించి మనకు యజ్ఞహోమాదుల రూపమున మనకు ప్రసాదించిరి. దీనిలో ఒక అంతర్భాగమే వాస్తు దోషము, ఈ వాస్తు అనుపదములో వాయువు + అస్తు = వాస్తు. ఈ యొక్క ఔషధ దినుసులకు (కాండము) అనగా సమిధలు అని పిలువుదురు. అవి తొమ్మిది ఈ సమిధులతో హోమాలు, చేయించిన గ్రహశాంతులు, గృహ శాంతులు, వాతావరణము యొక్క స్థితులకు, విషవాయువులకు, మనుష్యుల యొక్క రుగ్మతలను పోగొట్టుకొనుటకు చాలా చాలా ప్రశస్థములైనవి. గృహములు, గృహములు యొక్క చెడు స్థానముల యందు ఉండునప్పుడు ఆయా సమయముల యందు వాస్తు హోమము జరిపించవలయును. సమిధుల యొక్క వివరములు - వాటి యొక్క గ్రహములు

| గ్రహము | సమిధ | దానములు |
|---|---|---|
| 1. రవి | తెల్ల జిల్లేడు | గోధుమలు |
| 2. చంద్రుడు | మోదగ | వడ్లు |
| 3. కుజుడు | చంద్ర | కందులు |
| 4. బుధుడు | ఉత్తరేణి | పెసలు |
| 5. గురువు | రావి | శనగలు |
| 6. శుక్రుడు | మేడి (అత్తిచెట్టు) | అనుములు (బొబ్బర్లు) |
| 7. శని | జమ్మి | నువ్వులు |
| 8. రాహువు | గరిక | మినుములు |
| 9. కేతువు | దర్భ | ఉలవలు |

ఈ గ్రహములకు జపములు చేయవలయునన్న (ఆరోగ్యము కొరకు)

1. రవికి (సూర్యునికి) ఆరు వేలు (6)
2. చంద్రునకు పదివేలు (10)
3. కుజునకు ఏడు వేలు (7)
4. బుధునకు పదిహేడు వేలు (17)
5. గురునకు పదహారు వేలు (16)
6. శుక్రునకు ఇరువది వేలు (20)
7. శనికి పందొమ్మిది వేలు (19)
8. రాహువుకు పద్దెన్నిమిది వేలు (18)
9. కేతువునకు ఏడువేలు (7)

జపములు అన్ని వేలు చేసిన ఎడల ఆయా గ్రహములు శాంతించును.

ఆపైన చెప్పబడిన ఔషధ మొక్కలు కాండములను (శాఖలు) గృహము కట్టుటకు నిర్ణయించబడిన స్థలము నందు మొట్టమొదట స్థల పరీక్ష, వాస్తు హోమము, భూమి పూజ చేయబడిన తదుపరి గృహ నిర్మాణము చేపట్టిన అందునివశించు వారికి (ఆ గృహమందు) ఆరోగ్యములు, ఐశ్వర్యములు, సంపదలు, ఆయుష్షు వంశాభివృద్ధి కలుగును.

వాస్తు హోమము వల్ల మనకు ఎంతో మేలు జరుగును.

ఉదా : దర్భ ఇది కేతు గ్రహమునకు సంబంధించునది. దర్భ యొక్క ప్రభావము మనకు తెలుసు. గ్రహణ సమయములందు దీని ప్రభావము చాలా ఎక్కువగా ఉండును. విష దోషములను, చెడు గాలులు, చెడు కిరణములను ఇది తొలగించుటయే గాక మనకు మంచి ఆరోగ్య రక్షణ కలిగించును. ఈ యొక్క 9 రకముల మెటకేటెడ్ కలిగిన వృక్షశాఖలను హోమములందు ఉపయోగించిన మనకు మనస్సు ప్రశాంత ఆరోగ్యము, ఆయుష్షు పెరుగును.

మన స్వగృహములందు చేయించిన మంచి ఫలితములు పొందగలరు.

యజ్ఞములు దేవాలయములు యందు హోమములు గృహములయందు అగ్ని హోత్రములు స్వయముగా గృహము లందు ప్రశస్థములు ఆర్య సమాజము వారు అగ్ని హోత్రములు చేసి మంచి ఫలితములు పొందుచున్నారు.

సమిధ వీటిని ఉపయోగించి స్వంత ఇంటి యందు లేక గృహ నిర్మాణ ప్రదేశమందు హోమము చేయించిన ఎడల ఆ ప్రదేశము శుద్ధిచెంది ఆ ప్రాంతమందు గృహ నిర్మాణము చేయించిన ఆరోగ్యము ఆయుర్వృద్ధి పెరుగుటయే కాక మనస్సు ప్రశాంత చెందును.

ఏ ఏ సమిధ యందు ఔషధ గుణాలు ఉండునో తెలుసుకొందాం

1. **జిల్లేడు :** జిల్లేడు అనగా తెల్ల జిల్లేడు నందు మాత్రమే ఔషధ గుణాలు ఉండును. దీనిలో రోగ నిరోధక శక్తి ఉండును. ఇది శరీరము నందుకురుపులు, చీము, కఫము వాతము లకు ఉబ్బస వ్యాధులకు, కీళ్ళ నొప్పులకు, చర్మ వ్యాధులకు మొదలగు వాటి నివారణకు ఉపయోగపడును.
2. **మోదుగ :** రక్తములో ఉన్న చెడును తొలగించి రక్త శుద్ధి కలిగించును.
3. **చంద్ర :** మదుమేహం, జ్వరము, కురుపులు, దంత వ్యాధులకు, రక్త శుద్ధికి ఉపయోగపడును.
4. **ఉత్తరేణి :** గజ్జి, చర్మవ్యాధులు, కుష్టు, పంటి నెప్పులు, జీర్ణ కోశవ్యాధులు తగ్గించును.
5. **రావి :** శరీర నొప్పులకు గుండెలో మంట తగ్గుటకు, నోటి పూతకు అతిదాహం గర్భదోషాలు తొలుగును.
6. **మేడి :** ఇది నోటి యొక్క సొంగకారుట, వాతము, రక్త స్రావము తొలగించుటయే కాక రక్తమును శుభ్రపరచును.
7. **జమ్మి :** ఇది విష నివారిణి. ఎటువంటి విషగాలులు నిరూమలనకు, విష క్రిములు తొలగించును. ఈ యొక్క గాలి శరీర ఆరోగ్యమునకు ఎంతో మేలు చేయును.
8. **గరిక :** ఇది చెవి యొక్క చీము నివారణకు గాయములకు, చర్మ రోగములు, రక్తస్రావమునకు గజ్జి, కురుపుల నివారణకు ఉపయోగపడును.
9. **దర్భ :** ఇది గ్రహణ సమయాన వచ్చు దోషములను, చెడు గాలులు, చెడ్డ క్రిముల వలన సంభవించు దోషములను హరించును.

❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄



# తిరుక్కుఱళ్ - శ్రీవాణి



- డాక్టర్ గాలి గుణశేఖర్
ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అద్దంకి.

## మధ్యస్థం

**111. పక్షపాత రహిత పథమును మధ్యస్థు**
**దనుసరింప ధర్మమతిశయిల్లు**

మిత్రులు, శత్రువులు, ఇతరులు అనే భేదం పాటించకుండా, అందరి పట్ల న్యాయ బుద్ధి కలిగి ప్రవర్తించడం మధ్యస్థ లక్షణం. అటువంటి ప్రవర్తన వల్ల ధర్మం వర్ధిల్లుతుంది.

**112. ధర్మవర్తను సిరి తరుగులేక, తననె**
**కాక సంతునెల్ల కాచుచుండు**

ధర్మం తప్పకుండా జీవించే వ్యక్తి సంపద, నశించక తనకు తోడుగా ఉండడమే గాక, అంతటి భవిష్యత్తు తరాల వారికి సైతం రక్షగా ఉంటుంది.

**113. హిత మొసగిన కూడ ఎంచదగును, పాడి**
**తప్పి నట్టి పెంపు తప్పనంగ**

ఎటువంటి కీడు లేక, మేలు కలిగించినా, ధర్మం తప్పినందువల్ల ఏర్పడే అభివృద్ధిని వెంటనే విడిచిపెట్టాలి. దాన్ని అపరాధంగా భావించాలి.

**114. తగినవారో! కారో! తగవరులని, వారు**
**చనిన పిదప తెలియు, జనుల వలన**

న్యాయవర్తనులై జీవించారా? లేదా? అన్నది ఆ వ్యక్తుల మరణానంతరం ప్రజలు కీర్తించడం లేదా దూషించడం ద్వారా స్పష్టమవుతుంది.

**115. హెచ్చు తగ్గులెల్ల ఎంచక, ధృఢచిత్తు**
**లగుట ధర్మపరుల కాభరణము**

లోకంలో అభివృద్ధి, నాశనం సహజంగా మళ్ళీ మళ్ళీ ఏర్పడుతుంటాయి. రెండింటిలో ఏది కలిగినా చలించని మనస్సులో ధర్మబద్ధంగా జీవించడం ఉత్తములకు తగిన ఆభరణం అవుతుంది.

**116. మనసు పక్షపాతము జూప మరి పతనము**
**నిక్కమని యెరుగ వలయు నీతిపరుడు**

ఒక వ్యక్తి యొక్క మనస్సులో న్యాయం కాని చెడు తలపు కలిగితే, అది అతడి నాశనానికి కారణం అవుతుందని గ్రహించాలి.

**117. ధర్మవర్తి సిరులు తరిగినను సుజను**
**లాదరింతు రాత దధికుడని యె**

మధ్యస్థుడైన వ్యక్తి సంపదలు హరించుకు పోయినా, ప్రజలు అతడి సంపద లేమిని లోకువగా పరిగణించరు. ఉన్నతుడిగానే గౌరవిస్తారు.

**118. త్రాసు భంగి మనిషి తానొక వైపుకు**
**మ్రొగ్గకున్న చాలు మ్రొక్కు గొనును**

రెండు వైపులా సమంగా బరువుంచిన త్రాసులా, ఎటువైపు కూడా పక్షపాతం చూపకుండా న్యాయం పాటించేవాడు అందరిచేత నమస్కరింపబడతాడు.

**119. మనసు తిరము గలిగి, మాట వక్రత లేక**
**బ్రతుకు మనిషి పక్షపాతి గాడు**

స్థిరమైన మనస్సుతో, సూటిగా న్యాయం చెప్పి, ఆచరించే వ్యక్తి పక్షపాతం లేనివాడు.

**120. సొమ్ము పరులదైనను తన సొమ్మువలెనె**
**పెంచనెంచెడు వ్యాపారి పెంపుగనును**

ఇతరుల సొమ్ము పట్ల కూడా, తన సొమ్ము పట్ల చూపే శ్రద్ధను చూపి, ధర్మంగా ప్రవర్తించే వర్తకుడి వ్యాపారం మరింత వర్ధిల్లుతుంది.

## వినయం

**121. వినయమున్న వాడు వేల్పగు, లేనిచో**
**అంధకార మందు అడగిపోవు**

అణకువ ఒక మనిషిని దేవతల సరసన చేర్చగలుగుతుంది. ఆ వినయంతో విర్రవీగేవాడు కటిక చీకటి ఆవరించిన నరకకూపంలో పడతాడు.

**122. వినయమును తిరముగ వెలయింప వలయును**
**జీవి కంతకంటె తావి లేదు.**

జీవుడికి వినయం కంటె గొప్ప సంపద మరొకటి లేదు. కనుక వినయసంపదను ఎల్లప్పుడూ రక్షించి పెంపొందించుకోవాలి.

**123. నేర్వదగిన వాని నేర్చి, వినయమున్న**
**మేల్మగాంచు నతడు మక్కుటముగ**

తెలుసుకోగల వాటనన్నిటిని తెలుసుకొని, వినయ గుణాన్ని అలవరించుకుంటే, అతడి గొప్పతనం గుర్తింపబడి, ఎనలేని గౌరవాన్ని, మేలును కలుగజేస్తుంది.

**124. తన పథము విడువని వినయవంతు ఘనత**
**గిరి శిఖరము కన్న ఉరుతరమ్ము**

ఎటువంటి క్లిష్ట పరిస్థితుల లోను, తన మార్గం వదిలిపెట్టకుండా, అణుకువతో ప్రవర్తించే వ్యక్తి ఔన్నత్యం, పర్వత శిఖరం కంటె ఉన్నతమైనది.

**125. అధిక హితము గూర్చు అణుకువ యెల్లర,**
**కదియె ధనికి నైన అధిక ధనము**

ఎవరికైనా అణకువ గొప్ప మేలును చేకూర్చుతుంది. ఆ అణకువ సంపన్నులకు ఉంటే, మరింత సంపదను పెంచుతుంది.

**126. ఒక్క జన్మను తాబేలు ఫక్కి నింద్రియముల**
**నడచ జన్మలేడింటిని అనుసరించు**

తాబేలులా ఇంద్రియాలు అయిదింటిని నిగ్రహించి ఒక జన్మలో జీవించినట్లయితే తర్వాత ఏడు జన్మల్లోనూ అది రక్షణగా అనుసరిస్తుంది.

**127. జిహ్వనైన తగిన చెరనుంచకున్నచో**
**ముప్పుదెచ్చు మాటతప్పిదంబు**

ఇంద్రియాలు అయిదింటిలో కనీసం నాలుకనైనా అదుపులో ఉంచకపోతే, తాను పలికిన తప్పు మాట వలన ముప్పు కలిగి బాధపడవలసి ఉంటుంది.

**128. పొల్లు మాట ఒకటి పొడమినంతనె, ముందు**
**మాటల ఫలమెల్ల మాసిపోవు.**

తాను మాట్లాడిన మాటల్లో ఒక్క చెడుమాట ఉన్నా, అంతకుముందు మాట్లాడిన పలుకుల్లోని మంచి అంతా తుడుచుకుపోతుంది.

**129. అగ్ని గాయమైన అణగారి పోవును**
**నాల్క గాల్చు పుండు నయము గాదు**

నిప్పు వలన కలిగిన గాయం తొలుత బాధకలిగించినా, కాలక్రమంలో బయట గుర్తు తప్ప సమసిపోతుంది. కాని పొల్లు మాటల వల్ల ఏర్పడిన గాయం, మనసు నుంచి ఎన్నటికీ తొలిగిపోదు. బాధపెడుతూనే ఉంటుంది.

**130. కినుక వీడినట్టి వినయ సంపన్నుడౌ**
**మనుజ, ధర్మదేవుడనుసరించు**

కోపాన్ని అదుపులో ఉంచుకొని, విద్యతోబాటు వినయాన్ని పెంచుకున్న వ్యక్తి కై ఎదురుచూసి, అతడు పయనించే దారిని ధర్మదేవుడు అనుసరిస్తాడు. ధర్మానికి అతడు మార్గదర్శకుడు అవుతాడు.